


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 317 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కడప శనివారం 18 జూలై 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :317 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED :KADAPA SAT 18 JULY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Kadapa, Narasarao Peta,Bapatla,Ongole,Visakhapatnam,Kakinada, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




## వ్యవసాయంపై లోకేశ్ కు కనీస అవగాహన లేదు

- తాను చెప్పే ఐదు మొక్కల పేర్లు చెప్పాలని లోకేశ్ కి సవాల్
- పేర్లు చెబితే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్
- కూటమి ప్రభుత్వంలో అవినీతి అక్రమాలు రాజ్యమేలుతున్నాయని ఆరోపణ

పెన్ పవర్ డెస్క్:కూటమి ప్రభుత్వం, మంత్రి లోకేశ్ పై మాజీ మంత్రి, వైసీపీ నేత కాకాణి గోవర్ధన్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. వ్యవసాయంపై లోకేశ్ కు కనీస అవగాహన లేదని ఆయన ఎద్దేవా చేశారు. అంతేకాదు తాను చూపించే ఏవైనా ఐదు వ్యవసాయ

- మిగతా 2లో






## డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యం

- హైదరాబాద్‌ను చూసిన ప్రతిసారి అసూయ కలుగుతుంది... అదే నాలో కసిని పెంచింది: మంగళగిరిలో మంత్రి నారా లోకేశ్
- మంగళగిరిలో రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవంలో మంత్రి నారా లోకేశ్ ప్రసంగం
- 91 వేల మెజారిటీతో గెలిపించిన ప్రజల రుణం తీర్చుకుంటానని భావోద్వేగ ప్రసంగం
- అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా నిర్మిస్తామని, పెట్టుబడులు ఆకర్షిస్తామని హామీ

పెన్ పవర్ డెస్క్:"హైదరాబాద్‌ను చూసిన ప్రతిసారీ నాకు అసూయ కలుగుతుంది. అక్కడి విమానాశ్రయం, రైల్వే స్టేషన్లు, ఐటీ టవర్లు చూసినప్పుడు కలిగే ఆ అసూయే.. నాలో కసిని పెంచింది. ఆంధ్రప్రదేశ్‌ను దక్షిణ భారతదేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దగలమన్న నమ్మకాన్ని ఇచ్చింది"

- మిగతా 2లో



### యుద్ధం కొనసాగుతున్నా..

## భారత ఆర్థిక వ్యవస్థ బలంగానే ఉంది

- పశ్చిమాసియా ఉద్రిక్తతలు, రుతుపవనాల ముప్పును ప్రస్తావించిన ఆర్‌బీఐ గవర్నర్
- అయినా భారత ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందని మల్హోత్రా ధీమా
- రూపాయి పరిస్థితి సహజమేనని వివరణ
- వాణిజ్య ఒప్పందాలు ఎగుమతులకు ఊతమిస్తాయని భరోసా
- రిటైల్ ద్రవ్యోల్బణం 4 శాతం పరిధిలోనే ఉందని వెల్లడి

- మిగతా 2లో

### అమరావతిలో రోడ్లు, బిల్డింగ్‌లు పూర్తయ్యేలోపు

## టూరిజం ప్రాజెక్ట్స్ రెడీ కావాలి



### మంత్రి నారాయణ డెడ్‌లైన్!

- అమ్యూజ్‌మెంట్ పార్క్, ఎకో టూరిజం పార్కులను పీపీపీ విధానంలో అభివృద్ధి చేయనున్న ప్రభుత్వం
- అమరావతిలో రోడ్లు, భవనాలు పూర్తయ్యేలోపు టూరిజం ప్రాజెక్టులు పూర్తి కావాలన్న నారాయణ
- పనులు త్వరగా ప్రారంభమయ్యేలా చూడాలని ఆదేశం

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని కేవలం పరిపాలనా నగరంగానే కాకుండా, అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా మార్చేందుకు

- మిగతా 2లో

## జగన్ పాలనలో అదే పట్టిసీమ దిక్కయింది

- పట్టిసీమను జగన్ వట్టిసీమ అన్నారన్న దేవినేని ఉమా
- జగన్ అధికారంలోకి వచ్చాక అదే పట్టిసీమ ద్వారా నీరు ఇవ్వాల్సి వచ్చిందని ఎద్దేవా
- పులివెందులకు కూడా చంద్రబాబు నీరు ఇచ్చారని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:గంగా-కావేరి నదుల అనుసంధానంపై డాక్టర్ కేఎల్ రావు కలగన్నారని... ఆ స్ఫూర్తితోనే సీఎం చంద్రబాబు గోదావరి-కృష్ణ నదుల అనుసంధానాన్ని పట్టిసీమ ద్వారా సాకారం చేశారని మాజీ మంత్రి దేవినేని ఉమా వెల్లడించారు. గతంలో జగన్ పట్టిసీమను 'వట్టిసీమ' అని విమర్శించారని... ఆయన పాలనలో అదే పట్టిసీమ ద్వారా

- మిగతా 2లో




## మోదీ, చంద్రబాబు వచ్చాక పరిస్థితులు మారాయి

### నరసరావుపేటలో నిర్మలా సీతారామన్

- నరసరావుపేటలో బ్యాంకుల రుణమేళా
- హాజరైన నిర్మలా సీతారామన్, చంద్రబాబు
- 2014కు ముందు తమకు కావాల్సిన వారికి రుణాలు ఇప్పించుకునేవారన్న నిర్మల
- ప్రస్తుతం అర్హత ఆధారంగానే రుణాలు ఇస్తున్నట్టు వెల్లడి
- వీధి వ్యాపారులకు ప్రభుత్వమే గ్యారెంటీగా నిలుస్తోందని స్పష్టీకరణ

- మిగతా 2లో





## త్వరలోనే ఫడ్నవీస్ సీఎం పదవికి రాజీనామా చేస్తారు

- త్వరలోనే మోదీ కేబినెట్ విస్తరణ జరిగే అవకాశం ఉందన్న సంజయ్ రౌత్
- ఫడ్నవీస్‌కు కేంద్ర మంత్రివర్గంలో కీలక బాధ్యతలు ఇస్తారని జోస్యం
- మహారాష్ట్రకు బీజేపీకి చెందిన మరోనేత సీఎం అవుతారని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:మహారాష్ట్ర రాజకీయాల్లో మరోసారి దుమారం రేపేలా శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ ఠాక్రే) వర్గం ఫైర్‌బ్రాండ్ ఎంపీ సంజయ్ రౌత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ త్వరలోనే తన పదవికి రాజీనామా

- మిగతా 2లో

## త్వరలో ప్లాస్టిక్ కరెన్సీ నోట్లు.. కీలక ప్రయోగానికి ఆర్బీఐ సిద్ధం!

- త్వరలో పాలిమర్ కరెన్సీ నోట్ల ప్రయోగానికి ఆర్బీఐ శ్రీకారం!
- మొదటగా రూ. 10, రూ. వ20 డినామినేషన్లలో పైలట్ ప్రాజెక్టు
- కాగితం నోట్ల కంటే ఎక్కువ మన్నిక, భద్రత కలిగిన పాలిమర్ నోట్లు
- ప్రస్తుత కాగితం నోట్లు యథావిధిగా చలామణి
- 2027 నుంచి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చే అవకాశం

పెన్ పవర్ డెస్క్: దేశంలో పాలిమర్ (ప్లాస్టిక్) కరెన్సీ నోట్లను ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టే దిశగా భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) కసరత్తు చేస్తోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, ఈ పైలట్ ప్రాజెక్టును త్వరలోనే ప్రారంభించి, 2027 నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

- మిగతా 2లో



## మెక్సికోలో భారీ భూకంపం.. 7.3గా నమోదైన తీవ్రత




- మెక్సికో దక్షిణ పసిఫిక్ తీరంలో భారీ భూకంపం
- రిక్టర్ స్కేలుపై 7.3గా నమోదైన భూకంప తీవ్రత
- గ్వాటెమాలా, ఎల్ సాల్వడార్ వరకు కంపించిన భూమి

పెన్ పవర్ డెస్క్:మెక్సికో దక్షిణ పసిఫిక్ తీర ప్రాంతంలో భారీ భూకంపం సంభవించింది. గ్వాటెమాలా సరిహద్దుకు సమీపంలో చోటుచేసుకున్న ఈ భూప్రకంపనల ప్రభావం మెక్సికో సిటీతో పాటు ఎల్ సాల్వడార్ వరకు విస్తరించింది. యూఎస్ జియోలాజికల్ సర్వే నివేదిక ప్రకారం, రిక్టర్ స్కేలుపై ఈ భూకంప తీవ్రత 7.3గా నమోదైంది. చియాపాస్ తీరానికి సమీపంలోని అఖిలెస్ సెర్డాన్‌కు నైరుతి దిశగా 48 కిలోమీటర్ల

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# పొత్తులే కత్తులుగా మారతాయా? చంద్రబాబుకు అతి పెద్ద ఛాలెంజ్

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్థానిక సంస్థల ఎన్నికల్లో నిజమైన ఛాలెంజ్ ను ఎదుర్కొనే అవకాశాలు కనిపిస్తున్నాయి. అదీ ప్రత్యర్థి వైసీపీ నుంచి మాత్రం కాదు. కేవలం సొంత పార్టీలోని నేతల నుంచే. అనేక నియోజకవర్గాల్లో ఇప్పటికే నాయకత్వంలో గ్రూపులుగా విడిపోయి ఉన్నారు. పదవుల కోసం పోరాడి.. పోరాడి రెండేళ్ల నుంచి అలసి పోయి ఉన్నారు. వారందరినీ ఒక చోట చేర్చి అందరినీ మెప్పించి ఒక బాటలో పయనించేలా చేయడం కత్తిమీద మీద సామే అవుతుందని మాత్రం చెప్పాలి. ముఖ్యంగా కూటమి పార్టీలోని మిగిలిన మిత్ర పక్షాలు గెలిచిన స్థానాల్లోనూ ఎవరి మధ్య సఖ్యత లేదు. ఎవరి దారి వారిదే లాగా ఉంది.

**పొత్తులో భాగంగా...**

ఇప్పటికే పొత్తులో భాగంగా ఎమ్మెల్యే సీటును కోల్పోయిన తమకు మున్సిపల్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఛైర్మన్ పదవులను ఖచ్చితంగా మిత్ర పక్షాలు గెలిచిన నియోజకవర్గాల్లో టీడీపీ ఇన్ చార్జులు డిమాండ్ చేసే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. అయితే అక్కడ ఉన్న ఎమ్మెల్యే అందుకు ఒప్పుకునే పరిస్థితి ఉంటుందా? అన్నది కూడా అనుమానమే. వార్డు మెంబర్ల నుంచి జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల నుంచి టీడీపీ స్థానిక నేతల నుంచి చంద్రబాబు ఒత్తిడిని ఎదుర్కొంటారు. ఎమ్మెల్యే సీటు తమకు ఇవ్వకపోయినా తాము కూటమి ధర్మాన్ని పాటించి మద్దతు ఇచ్చి గెలుపులో ముఖ్యపాత్ర వహించినప్పటికీ, గెలిచిన తర్వాత మాత్రం తమను పట్టించుకోవడం లేదని అనేక నియోజకవర్గాల నుంచి ఇప్పటికే పార్టీ నాయకత్వానికి ఫిర్యాదులు అందుతున్నాయి.

**పదవుల కోసం ఘర్షణలు...**

ఇటీవల తిరుపతి పట్టణంలో జరిగిన తంబళ్లపల్లి, పుంగనూరు నియోజకవర్గంలోనే ఇన్ ఛార్జి పదవి కోసం నేతల తరుపున కార్యకర్తలు ఘర్షణలకు దిగడాన్ని చూశాం. ఇక స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో రాజీ పడకపోవచ్చు. వీరందరినీ సముదాయించడం చంద్రబాబుకు ఆషామాషీ కాదు. అలాగని జిల్లా ఇన్ ఛార్జి మంత్రులపై ఈ భారాన్ని మోపితే వారు ఒత్తిడికి గురయి వదిలేస్తారు. నారా లోకేశ్ చేయి వేసినా వారందరినీ ఒక బాటలో పయనించేలా చేయడం కష్టంగానే కనిపిస్తుంది. అందుకే స్థానిక సంస్థల ఎన్నికలు అధికారంలో ఉన్న చంద్రబాబుకు అతి పెద్ద సమస్యగా మారే అవకాశముంది. ఒకవేళ మిత్ర పక్షాలకు ఇచ్చిన చోట ఒకరినొకరు సహకరించుకునే పరిస్థితి ఉండదు. మరి ఈ పరిస్థితి నుంచి పార్టీని ఎలా బయటపడేస్తారన్నది చూడాలి.

# వ్యవసాయంపై లోకేశ్ కు కనీస అవగాహన లేదు

- మొదటి పేజి తరువాయి

మొక్కల పేర్లను ఆయన సరిగ్గా చెబితే తాను రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని కాకాణి సవాల్ విసిరారు. చంద్రబాబు ప్రభుత్వం కేవలం దోపిడీయే పరమావధిగా పాలిస్తోందన్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి ఆదాయ వనరులు సమకూరితే, ప్రస్తుతం చంద్రబాబు వాటిని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారని కాకాణి దుయ్యబట్టారు. వైసీపీ హయాంలో నిర్మించిన రామాయపట్నం పోర్టును ఈ ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టడమే ఇందుకు నిదర్శనమని కాకాణి విమర్శించారు. ఈ ప్రభుత్వంలో గ్రావెల్ తవ్వకాల నుంచి నిరుద్యోగుల డీఎస్సీ నోటిఫికేషన్ వరకు ప్రతి ఒక్క విషయంలోనూ అవినీతి అక్రమాలు రాజ్యమేలుతున్నాయని ఆరోపించారు. ప్రతి పథకంలోనూ, ప్రభుత్వ నిర్ణయంలోనూ పారదర్శకత లోపించిందన్నారు. కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను, అవినీతిని ప్రజలందరూ గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. వ్యవసాయ రంగం, రాష్ట్ర అభివృద్ధి అంశాలపై కాకాణి చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమవుతున్నాయి.

# అమరావతిలో రోడ్లు, బిల్డింగ్‌లు పూర్తయ్యేలోపు టూరిజం ప్రాజెక్ట్స్ రెడీ కావాలి

- మొదటి పేజి తరువాయి

కూటమి ప్రభు త్వం కసరత్తులు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా కృష్ణా నదీ తీరాన 'రివర్ ఫ్రంట్ టూరిజం' అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది.అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ అధికారులతో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ శుక్రవారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ భేటీలో ఏడీసీఎల్ ఛైర్‌పర్సన్ లక్ష్మీ పార్థసారథితో పాటు పలువురు కీలక అధికారులు పాల్గొన్నారు.

**ఈ సమీక్షా సమావేశం ముఖ్యాంశాలు:**

పీపీపీ విధానంలో పార్కుల అభివృద్ధి: అమరావతిలో సరికొత్త ప్రపంచాన్ని ఆవిష్కరించేలా భారీ 'అమ్యూజ్‌మెంట్ పార్క్', పర్యావరణాన్ని ప్రతిబింబించేలా 'ఎకో టూరిజం పార్క్'లను పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ ) పద్ధతిలో అభివృద్ధి చేయాలని ఏడీసీఎల్ నిర్ణయించింది.

మంత్రి నారాయణ డెడ్‌లైన్: రాజధాని పరిధిలో ప్రధాన రహదారులు, ప్రభుత్వ భవనాల నిర్మాణాలు ఒక కొలిక్కి వచ్చే సమయానికే.. సమాంతరంగా ఈ పర్యాటక ప్రాజెక్టులన్నీ కూడా పూర్తి కావాలని అధికారులను మంత్రి ఆదేశించారు. సీఎం చంద్రబాబు విజన్: ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మార్గదర్శకాలు, సూచనలకు అనుగుణంగా.. దేశ విదేశీ పర్యాటకులను ఆకర్షించేలా ప్రాజెక్ట్ డిజైన్లు ఉండాలని, పనుల్లో వేగం పెంచాలని మంత్రి స్పష్టం చేశారు.రైతులకు, పర్యాటకులకు అనుకూలంగా ఉండేలా ఇప్పటికే టూరిజం ప్రాజెక్టుల కోసం భూములు తీసుకున్న ఇతర ప్రైవేట్ సంస్థలు కూడా కాలయాపన చేయకుండా తక్షణమే తమ నిర్మాణ పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి నారాయణ సూచించారు. తాజా సమీక్షతో అమరావతి రివర్ ఫ్రంట్ ప్రాజెక్టులకు మరింత ఊపు రానుంది.

# త్వరలోనే ఫడ్నవీస్ సీఎం పదవికి రాజీనామా చేస్తారు

- మొదటి పేజి తరువాయి

చేసి, ఢిల్లీ బాట పట్టబోతున్నారంటూ ఆయన జోస్యం చెప్పారు. రాబోయే ఒకటి లేదా రెండు నెలల్లో కేంద్రంలో మోదీ కేబినెట్ విస్తరణ జరిగే అవకాశం ఉందని, అదే జరిగితే మహారాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు ఖాయమని సంజయ్ రౌత్ పేర్కొన్నారు. సీఎం ఫడ్నవీస్‌ను ఢిల్లీకి పిలిపించి కేంద్ర మంత్రివర్గంలో కీలక బాధ్యతలు అప్పగిస్తారని, ఆయన స్థానంలో బీజేపీకి చెందిన ఒక సీనియర్ నేతను మహారాష్ట్ర ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెడతారని సంచలన వ్యాఖ్యలు చేశారు. శివసేన (ఖదీ) ప్రతిష్ఠాత్మకంగా చేపట్టబోతున్న 'రామ రక్షా ఆందోళన్' సన్నాహకాలను పర్యవేక్షించేందుకు నాగ్‌పూర్ వెళ్లిన సంజయ్ రౌత్.. అక్కడి నుంచే ఈ పొలిటికల్ బాంబ్ పేల్చారు.

# గత విధ్వంసం నుంచి ఏపీని కేంద్రమే నిలబెట్టింది

గత ఐదేళ్ల పాలనలో జరిగిన విధ్వంసం నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని కేంద్ర ప్రభుత్వమే నిలబెట్టిందని, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్రం అందించిన సహకారంతోనే రాష్ట్రం తిరిగి గాడిన పడుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కలిసి ఆయన 'క్రెడిట్ అవుట్ రీచ్' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ.. కేంద్రం అందిస్తున్న చేయూత వల్లే రాష్ట్రం ఆర్థికంగా నిలదొక్కుకోగలుగుతోందని అన్నారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టులతో పాటు విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలోనూ కేంద్రం రాష్ట్రానికి అండగా నిలిచిందని గుర్తుచేశారు.

ఈ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాల కింద 1,03,246 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ రూ.3,216 కోట్ల రుణాలను పంపిణీ చేశారు. అనంతరం బాలికలకు సైకిళ్లను అందజేశారు.

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల అంతిమ లక్ష్యం ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమేనని అన్నారు. ఒకప్పుడు రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడు బ్యాంకులే ప్రజల వద్దకు వచ్చి రుణాలు ఇవ్వడం శుభపరిణామమని పేర్కొన్నారు. ఈ రుణమేళా ద్వారా వ్యవసాయ రంగానికి రూ.2,363 కోట్లు, ఎంఎస్ఎంఈలకు రూ.325 కోట్లు, గృహ, విద్య, ఇతర రంగాలకు రూ.624 కోట్లు అందించినట్లు వివరించారు.కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నాయకత్వ పటిమను చంద్రబాబు ప్రత్యేకంగా ప్రశంసించారు. దేశంలో మొండి బకాయిలపై (ఛీూూ) కఠినంగా వ్యవహరించి, డిజిటల్ బ్యాంకింగ్ విప్లవాన్ని తీసుకొచ్చిన ఘనత ఆమెకే దక్కుతుందన్నారు. జీఎస్టీ విధానంలో మార్పులు చేసి ప్రభుత్వ ఆదాయాన్ని పెంచారని కొనియాడారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన అధిక వడ్డీ అప్పులను కేంద్రం సహకారంతో రీషెడ్యూల్ చేశామని, దీని ద్వారా రాష్ట్రానికి రూ.1,538 కోట్ల మేర ఆదా అయిందని తెలిపారు.

రాయలసీమను హార్టికల్చర్ హబ్?గా మార్చేందుకు కేంద్రం రూ.40 వేల కోట్ల సహకారం అందిస్తోందని, ప్రైవేటు పెట్టుబడులతో ఈ ప్రాంతాన్ని ఉద్యానవన కేంద్రంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని డ్వాక్రా మహిళలు పొదుపులో, రుణాల చెల్లింపులో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని, వారిని వ్యాపారవేత్తలుగా మార్చేందుకు 'వన్ ఫ్యామిలీ, వన్ ఎంట్రప్రెన్యూర్' కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను హెల్తీ, వెల్తీ, హ్యాపీ సొసైటీగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, పలువురు బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

# యుద్ధం కొనసాగుతున్నా.. భారత ఆర్థిక వ్యవస్థ బలంగానే ఉంది

పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, బలహీన రుతుపవనాల ముప్పు ఉన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ బలంగానే ఉందని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పష్టం చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా ముందుకు సాగుతోందని చెప్పారు. అయితే అంతర్జాతీయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం వేచి చూసే ధోరణిని అనుసరించాల్సిన అవసరం ఉందని సూచించారు. దూరదర్శన్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.ఇరాన్ యుద్ధం తర్వాత అమెరికా డాలర్ బలపడిందని మల్హోత్రా తెలిపారు. దీంతో అనేక దేశాల కరెన్సీలు బలహీనపడ్డాయని చెప్పారు. ప్రపంచ పరిస్థితులతో పోలిస్తే రూపాయి విలువలో వచ్చిన మార్పు సహజంగానే ఉందని స్పష్టం చేశారు. రూపాయి పనితీరుపై ఆందోళన అవసరం లేదని పేర్కొన్నారు.భారత విదేశీ వాణిజ్యం బలంగానే కొనసాగుతోందని ఆర్‌బీఐ గవర్నర్ వెల్లడించారు. సేవల ఎగుమతులు, విదేశాల్లో ఉన్న భారతీయుల నుంచి వచ్చే నగదు, రికార్డు స్థాయి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు దేశానికి అండగా నిలుస్తున్నాయని చెప్పారు. బ్రిటన్‌తో కుదిరిన వాణిజ్య ఒప్పందం, యూరోపియన్ యూనియన్, అమెరికాతో కొనసాగుతున్న చర్చలు కూడా ఎగుమతులకు ఊతమిస్తాయని వివరించారు.సరఫరా సంబంధిత కారణాల వల్లే ఇటీవల ద్రవ్యోల్బణం పెరిగిందని మల్హోత్రా తెలిపారు. ప్రస్తుతం రిటైల్ ద్రవ్యోల్బణం

4 శాతం పరిధిలోనే ఉందని చెప్పారు. ధరల స్థిరత్వంతో పాటు ఆర్థిక వృద్ధి మధ్య సమతుల్యం కాపాడే దిశగా ఆర్‌బీఐ చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు. అందుకే ఈ ఏడాది ఇప్పటివరకు కీలక వడ్డీ రేటును 5.25 శాతం వద్దే కొనసాగించినట్లు పేర్కొన్నారు.అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు మళ్లీ పెరుగుతున్నాయని మల్హోత్రా గుర్తుచేశారు. భారత్ తన అవసరాల్లో దాదాపు 88 శాతం ముడి చమురును దిగుమతి చేసుకుంటోందని చెప్పారు. చమురు ధరలు పెరిగితే ద్రవ్యోల్బణం, కరెంట్ అకౌంట్ లోటుపై ప్రభావం పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ఆగస్టు 3 నుంచి 5 వరకు జరిగే ద్రవ్య విధాన కమిటీ సమావేశంలో తాజా ఆర్థిక పరిస్థితులను సమీక్షించి వడ్డీ రేట్లపై నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు.

# మోదీ, చంద్రబాబు వచ్చాక పరిస్థితులు మారాయి

ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు లాంటి నేతలు అధికారంలోకి వచ్చాక దేశంలో పరిస్థితులు పూర్తిగా మారాయని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. గతంలో ఫోన్ బ్యాంకింగ్ ద్వారా ఎవరికి రుణాలు ఇవ్వాలో నిర్దేశించే వారని, కానీ ఇప్పుడు బ్యాంకులు నేరుగా ప్రజల వద్దకే వెళ్లి అర్హులైన వారికి అండగా నిలుస్తున్నాయని స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో ప్రభుత్వ రంగ బ్యాంకులు సంయుక్తంగా నిర్వహించిన 'క్రెడిట్ అవుట్‌రీచ్' కార్యక్రమంలో ఆమె ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, పలువురు బ్యాంకుల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ, బ్యాంకులు ప్రజల వద్దకు వెళ్లి సేవలు అందించాలన్నది ప్రధాని మోదీ ఆలోచన అని తెలిపారు. 2004 నుంచి 2014 మధ్య కేంద్రంలో ఉన్న ప్రభుత్వం, ఫోన్ కాల్స్ ద్వారా తమకు కావాల్సిన వారికి రుణాలు ఇప్పించుకునేదని, కానీ ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక ఆ విధానానికి స్వస్తి పలికిందని విమర్శించారు. ప్రస్తుతం గ్రామగ్రామాన బ్యాంకులు పర్యటించి, ఎలాంటి హామీ లేకుండా అర్హత ఉన్నవారికి రుణాలు అందిస్తున్నాయని చెప్పారు. వీధి వ్యాపారులకు సైతం ప్రభుత్వమే గ్యారెంటీ ఇచ్చి వారి వ్యాపారాలకు చేయూతనిస్తోందని వివరించారు. అధిక వడ్డీలకు అప్పులిచ్చే వ్యాపారుల బారిన పడకుండా మైక్రో ఫైనాన్స్ ద్వారా మహిళలు, చిరు వ్యాపారులను ఆదుకోవడమే తమ లక్ష్యమన్నారు.దేశవ్యాప్తంగా బ్యాంకులు తమ పనితీరును, ప్రజలు బ్యాంకుల పట్ల తమ దృక్పథాన్ని మార్చుకున్నారని, నరసరావుపేటలో జరిగిన ఈ రుణమేళానే దానికి నిదర్శనమని అన్నారు. వ్యాపారవేత్తలుగా, పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు కోట్లాది రూపాయల రుణాన్ని బ్యాంకులు అందించాయని తెలిపారు. 2047 నాటికి భారతదేశాన్ని అగ్రగామి అభివృద్ధి చెందిన దేశంగా, 'వికసిత్ భారత్'గా నిలబెట్టడమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఆమె పునరుద్ఘాటించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సమకూర్చిన అంబులెన్స్‌లను సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం బాలికలకు సైకిళ్లను పంపిణీ చేసి, వివిధ రంగాలకు చెందిన లబ్ధిదారులకు రుణాలను వితరణ చేశారు.

# జగన్ పాలనలో అదే పట్టిసీమ దిక్కయింది

- మొదటి పేజి తరువాయి

నీటిని ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందని వ్యంగ్యంగా అన్నారు. ఇది దేవుడు రాసిన స్క్రిప్ట్ అని చెప్పారు.

పట్టిసీమ, అమరావతి నిర్మాణాల్లో జగన్ అడ్డంకులు సృష్టించి రాష్ట్రాభివృద్ధికి ఆటంకం కలిగించారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు అకుంఠిత దీక్షతో మార్చి 2025లో పట్టిసీమ పనులు ప్రారంభించి, సెప్టెంబర్‌లోనే తొలి విడతగా కొంత నీటిని డెల్టాకు నీరందించారని తెలిపారు. పులివెందులకు కూడా చంద్రబాబు నీరు ఇచ్చారని అన్నారు.

పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా గోదావరి నీరు అందడం వల్ల చౌడు భూములు సారవంతంగా మారి, ఎకరాకు దిగుబడి 50 నుంచి 60 బస్తాలకు

పెరిగిందన్నారు. సాగు నీరు సమృద్ధిగా అందడం వల్ల ఎరువుల ఖర్చు తగ్గి రైతుల ఆదాయం పెరిగిందని, రాయలసీమ నేడు హార్టికల్చర్ రంగంలో అద్భుతాలు చేస్తోందని ఉమా వివరించారు.

# మెక్సికోలో భారీ భూకంపం.. 7.3గా నమోదైన తీవ్రత

- మొదటి పేజి తరువాయి

దూరంలో, భూ అంతర్భాగంలో 15 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. ఈ ప్రధాన భూకంపానికి ముందు సముద్ర గర్భంలో స్వల్ప స్థాయిలో ప్రకంపనలు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.భూకంప తీవ్రతకు ప్రజలు తీవ్ర భయాందోళనకు గురై ఇళ్ల నుంచి వీధుల్లోకి పరుగులు తీశారు. మెక్సికో, గ్వాటెమాలా సరిహద్దుల్లోని సుచియాటే నగరంలో సునామీ ముప్పు పొంచి ఉందనే అనుమానంతో తీర ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు మేయర్ ఎల్మర్ పేర్కొన్నారు. మెక్సికో దక్షిణ సరిహద్దులోని కీలక నగరమైన టపచులాలో తొలుత స్వల్పంగా ప్రారంభమైన ప్రకంపనలు, కొద్దిసేపటికే తీవ్రరూపం దాల్చాయి.

"మేము ఆసుపత్రిలోని రెండో అంతస్తులో ఉన్న సమయంలో భూమి కంపించడం మొదలైంది. తొలుత ఇది సాధారణ ప్రకంపనలే అని భావించాం, కానీ తీవ్రత పెరగడంతో అప్రమత్తమై భవనం నుంచి బయటకు వచ్చేశాం" అని ఓ ఉద్యోగిని అసోసియేటెడ్ ప్రెస్ ప్రతినిధికి వివరించారు.

గ్వాటెమాలా సిటీలో భూప్రకంపనలు దీర్ఘకాలం పాటు కొనసాగడంతో జనం ఆందోళన చెందారు. మెక్సికో సిటీలోని పలు ప్రాంతాల్లో భవనాలు ఒక్కసారిగా ఊగిపోయాయి. అయితే, భూకంపం సంభవించిన ప్రారంభ క్షణాల్లో దాని తీవ్రత నిర్దేశిత పరిమితిని మించకపోవడం వల్ల ఎర్త్‌క్వేక్ అలర్ట్ సిస్టమ్ మోగలేదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# త్వరలో ప్లాస్టిక్ కరెన్సీ నోట్లు.. కీలక ప్రయోగానికి ఆర్బీఐ సిద్ధం!

- మొదటి పేజి తరువాయి

తొలి దశలో భాగంగా రూ. 10, రూ. 20 వంటి తక్కువ ముఖ విలువ కలిగిన నోట్లతో ఈ ప్రయోగాన్ని ప్రారంభించాలని ఆర్బీఐ యోచిస్తోంది. ప్రస్తుతం చలామణిలో ఉన్న కాగితపు నోట్లను రద్దు చేయకుండానే, దశలవారీగా ఈ కొత్త పాలిమర్ నోట్లను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇందులో భాగంగా అత్యాధునిక భద్రతా ప్రమాణాలతో కూడిన పాలిమర్ షీట్లను సరఫరా చేసేందుకు ఆర్బీఐ నోట్ల ముద్రణ విభాగం ఇప్పటికే గ్లోబల్ ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ (ఈవోఐ) జారీ చేసింది. బిడ్ల దాఖలుకు ఆగస్టు 18ని తుది గడువుగా నిర్ణయించింది.

దేశంలో యూపీఐ వంటి డిజిటల్ చెల్లింపులు గణనీయంగా పెరిగినప్పటికీ, నగదు వినియోగం మాత్రం తగ్గలేదు. దీనికి తోడు పాత నోట్ల స్థానంలో కొత్త వాటిని ముద్రించడం వల్ల ముద్రణా వ్యయం భారంగా మారుతోంది. ఈ నేపథ్యంలో కాటన్‌తో తయారు చేసే కాగితపు నోట్లకు బదులు, ప్లాస్టిక్ ఆధారిత పాలిమర్ నోట్లను తీసుకురావడం ద్వారా ఖర్చును తగ్గించుకోవచ్చని ఆర్బీఐ భావిస్తోంది. ఈ నోట్లు ఎక్కువ కాలం మన్నడమే కాకుండా నీరు, మురికి వంటి వాటికి త్వరగా పాడవవు. ఇప్పటికే ఆస్ట్రేలియా, యూకే, కెనడా వంటి దేశాల్లో ఇవి విజయవంతంగా చలామణిలో ఉన్నాయి.గతంలో 2012-14 మధ్య కాలంలోనే ఆర్బీఐ ఈ ప్రతిపాదన చేసినప్పటికీ, కొన్ని సాంకేతిక కారణాల వల్ల అది కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు మళ్లీ ఈ అంశంపై దృష్టి సారించిన కేంద్ర బ్యాంక్, ఏటీఎంలలో వీటి అనుకూలత వంటి సాంకేతిక అంశాలను పరిశీలిస్తూ పైలట్ ప్రాజెక్టుకు సిద్ధమవుతోంది. అయితే, దీనిపై ఆర్బీఐ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

# డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యం

- మొదటి పేజి తరువాయి

అని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ శక్తిమంతమైన ప్రసంగం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం వర్చువల్ విధానంలో ప్రారంభించిన ఆధునిక హంగులతో కూడిన మంగళగిరి రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవ సభలో లోకేశ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తన ప్రసంగంలో అభివృద్ధి, రాజకీయాలు, వ్యక్తిగత ప్రస్థానాన్ని కలగలిపి, ప్రజల్లో నూతనోత్సాహం నింపారు.ప్రధాని మోదీ నాయకత్వంలో దేశంలో రైల్వే వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని లోకేశ్ కొనియాడారు. "ఒకప్పుడు రైళ్లు సమయానికి వచ్చేవి కావు, బోగీలు శుభ్రంగా ఉండేవి కావు. కానీ నేడు వందే భారత్, బుల్లెట్ రైళ్లు, కవచ్ భద్రతా టెక్నాలజీ, 100 శాతం విద్యుదీకరణతో రైల్వే రంగం స్వరూపమే మారిపోయింది. దేశాభివృద్ధికి రైల్వేలే కీలకమని ప్రధాని మోదీ బలంగా విశ్వసిస్తున్నారు" అని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళగిరిలో మరిన్ని రైళ్లు ఆగేలా చర్యలు తీసుకోవాలని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను సభాముఖంగా కోరారు.అమరావతి అభివృద్ధిపై లోకేశ్ తన దార్శనికతను స్పష్టం చేశారు. "రాజధాని అమరావతికి రోడ్డు, రైలు, వాయు మార్గాల అనుసంధానం అత్యంత కీలకం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు ఈ మూడింటినీ అనుసంధానిస్తూ ఒక ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ నెట్‌వర్క్‌ను రూపొందిస్తున్నారు. 2019-24 మధ్య ఆగిపోయిన అమరావతి పనులను ఇప్పుడు చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గారు పరుగులు పెట్టిస్తున్నారు. అమరావతిని ఒక గ్లోబల్ సిటీగా మార్చడమే మా అందరి లక్ష్యం" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు ఉన్న 'డబుల్ ఇంజన్ సర్కార్'తోనే ఇది సాధ్యమని ఆయన అన్నారు. దశాబ్దాల కల అయిన విశాఖ కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్‌ను ప్రధాని మోదీ ఆచరణలోకి తెచ్చారని గుర్తుచేశారు.ఈ సందర్భంగా మంగళగిరితో తనకున్న అనుబంధాన్ని, రాజకీయ ప్రయాణాన్ని లోకేశ్ భావోద్వేగంగా పంచుకున్నారు. "2019లో 5,300 ఓట్లతో ఓడిపోయినప్పుడు కుంగిపోలేదు. ఐదేళ్లు మీ మధ్యనే ఉన్నా, చెమటోడ్చి కష్టపడ్డా, మీ మనసు గెలుచుకున్నా. నేను ఏ మెజారిటీతో అయితే ఓడిపోయానో, దాని పక్కన ఒక సున్నా పెట్టి గెలిపించాలని కోరాను. మీరు నా మాట నిలబెట్టారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే టాప్-3 మెజారిటీతో, 91 వేల ఓట్ల ఆధిక్యంతో నన్ను గెలిపించి శాసనసభకు పంపించారు. ఈ గెలుపు నాకు కొండంత బలాన్నిచ్చింది, నాపై బాధ్యతను పెంచింది" అని అన్నారు. ఈ మెజారిటీని చూపించే కేంద్ర, రాష్ట్ర మంత్రులపై ఒత్తిడి తెచ్చి నియోజకవర్గానికి పనులు చేయిస్తున్నానని తెలిపారు.ఎమ్మెల్యే, ఎంపీ కలిసి పనిచేస్తే ఒక ప్రాంతం ఎంత అద్భుతంగా అభివృద్ధి చెందుతుందో చెప్పడానికి మంగళగిరి ఒక ఉదాహరణ అని లోకేశ్ అన్నారు. ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి పనిచేస్తూ లక్ష్మీ నరసింహా స్వామి గుడి అభివృద్ధికి, భూగర్భ డ్రైనేజీ వంటి పనులకు కేంద్రం నుంచి నిధులు సాధిస్తున్నామని వివరించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నా, సంక్షేమం, అభివృద్ధిని జోడెద్దుల బండిలా ముందుకు తీసుకెళుతున్నామని తెలిపారు. రాయల్ ఎన్‌ఫీల్డ్, గూగుల్, అదానీ అంకా వంటి పెద్ద కంపెనీలు ఏపీ వైపు చూస్తున్నాయని, రాబోయే మూడేళ్లలో యువత ఉద్యోగాల కోసం పక్క రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. తనను గెలిపించిన ప్రజల కోసం అహర్నిశలు కష్టపడతానని, వారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుతూ లోకేష్ తన ప్రసంగాన్ని ముగించారు.

పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా । తిరుపతి । చిత్తూరు । వై.ఎస్.ఆర్. కడప

## ప్రజల సమస్యల పరిష్కారమే మా బాధ్యత : ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



**కోవూరు పెన్ పవర్ జులై 17.** కోవూరు నియోజకవర్గ ప్రజల నుంచి వచ్చే ప్రతి విన్నపాన్ని సానుకూలంగా పరిశీలించి, వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించడమే తమ ధ్యేయమని కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం నెల్లూరులోని వీపీఆర్ కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన ప్రజలను ఆమె స్వయంగా కలిసి, వారి సమస్యలను అడిగి తెలుసుకుంటూ వినతిపత్రాలను స్వీకరించారు. ప్రజలు ప్రధానంగా తమ ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్ల పునర్నిర్మాణం, నిరుపేదలకు ఇళ్ల స్థలాల మంజూరు, అలాగే స్థానిక ఆలయాల నిర్మాణం పనులకు సంబంధించిన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు సమర్పించిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి ప్రాధాన్యతా క్రమంలో వీలైనంత వేగంగా పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. సంబంధిత ప్రభుత్వ అధికారులతో మాట్లాడి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా అధికారులు బాధ్యతాయుతంగా, పారదర్శకంగా వ్యవహరించాలని ప్రశాంతి రెడ్డి సూచించారు.

# తీరిన మూడు తరాల రైతుల కష్టాలు

**రాజముద్రతో 322 పాసు పుస్తకాల పంపిణీ**
**పోతిరెడ్డిపాళెంలో రూ.36 లక్షలతో విలేజ్ హెల్త్ సెంటర్ ప్రారంభించిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**
**రైతుల నమ్మకాన్ని నిలబెట్టిన కూటమి ప్రభుత్వం**
**త్వరలోనే షుగర్ ఫ్యాక్టరీ సమస్యకూ పరిష్కారం**





**కోవూరు పెన్ పవర్ జూలై 17:** రైతు భూమికి సంపూర్ణ భద్రత కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, అందుకే రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాసుపుస్తకాలను రైతులకు అందజేస్తున్నామని కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి తెలిపారు. శుక్రవారం కోవూరు మండలం పోతిరెడ్డిపాళెంలో రూ.36 లక్షల వ్యయంతో నిర్మించిన విలేజ్ హెల్త్ సెంటర్‌ని ప్రారంభించి, అనంతరం 322 మంది రైతులకు కొత్త పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ... పోతిరెడ్డిపాళెంలో మూడు తరాలుగా కొందరు రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు లేక ఇబ్బందులు పడటం బాధాకరమన్నారు. డెల్టా ప్రాంతంలో, నెల్లూరుకు సమీపంలో ఉన్న గ్రామంలో ఇలాంటి సమస్యలు ఇన్నేళ్లుగా కొనసాగినా గత ప్రభుత్వాలు, అధికారులు పట్టించుకోకపోవడం విచారకరమని అన్నారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన వెంటనే స్పందించి రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందించేందుకు సహకరించిన మంత్రి అనగాని సత్యప్రసాద్ రైతుల హక్కులను కాపాడుతున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా సుమారు 140 మంది రైతుల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని కూడా త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

**ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుతో రైతులకు భరోసా :** గత ప్రభుత్వం తీసుకొచ్చిన వివాదాస్పద ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రైతుల్లో తీవ్ర ఆందోళన కలిగించిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆ చట్టాన్ని రద్దు చేసి రైతులకు కొండంత భరోసా కల్పించారని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నామని, ఈ నెల 22న 'తల్లికి వందనం' పథకం కింద తల్లుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నట్లు తెలిపారు.

**రూ.770 కోట్లతో కోవూరు అభివృద్ధి :** గత ప్రభుత్వం అస్తవ్యస్తం చేసిన రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని కూటమి ప్రభుత్వం గాడిలో పెడుతూ అభివృద్ధి, సంక్షేమాన్ని సమాంతరంగా ముందుకు తీసుకెళ్తోందని ఎమ్మెల్యే తెలిపారు. యువనేత నారా లోకేష్ ఆధ్వర్యంలో విద్యా రంగం, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో గ్రామీణాభివృద్ధి వేగంగా సాగుతోందన్నారు. వీరి సహకారంతోనే కేవలం రెండేళ్లలో కోవూరు నియోజకవర్గంలో సుమారు రూ.770 కోట్ల విలువైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని చెప్పారు. అలాగే సీఎంఆర్ఎఫ్ ద్వారా కోవూరు నియోజకవర్గంలో దాదాపు వెయ్యి మందికి రూ.10 కోట్లకు చేరువైన ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు.

**షుగర్ ఫ్యాక్టరీ హామీ తప్పకుండా నెరవేరుస్తాం :** ఎన్నికల సమయంలో ఇచ్చిన ఇనాం భూముల సమస్య పరిష్కారమైందని, రెండో ప్రధాన హామీ అయిన షుగర్ ఫ్యాక్టరీ అంశాన్ని కూడా ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారులతో చర్చిస్తున్నానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమస్యను తాను ఏ రోజూ మర్చిపోలేదని, త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. అలాగే కొడవలూరులోని కిసాన్ సెజ్ ద్వారా దాదాపు రూ.15 వేల కోట్ల పెట్టుబడులు రానున్నాయని, స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు.

**వీపీఆర్ నేత్ర సేవలను వినియోగించుకోవాలి :** వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వీపీఆర్ నేత్ర సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. పోతిరెడ్డిపాళెంలో కార్యక్రమం పూర్తయిందని, ప్రస్తుతం చుండుగుంటలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లు కూడా అందజేస్తున్నామని చెప్పారు. కార్యక్రమం అనంతరం కొత్త పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి స్థానిక రైతులు గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జొన్నవాడ ఆలయ చైర్మన్ అశోక్ రెడ్డి, పెన్నా డెల్టా చైర్మన్ గోపిరెడ్డి, తెలుగుదేశం మండల అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, ఇంత మల్లారెడ్డి, మండల కార్యదర్శి నాగరాజు, వెంకటరమణారెడ్డి, తహసీల్దార్ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు

## దివ్యాంగులకు అండగా వీపీఆర్ ఫౌండేషన్

**మరో ఇద్దరికి ఉచిత ట్రైసైకిళ్లు అందజేసిన వేమిరెడ్డి దంపతులు**
**నెల్లూరు జిల్లాలో ఇప్పటి వరకు 1,040 ట్రైసైకిళ్ల పంపిణీ**



**కోవూరు పెన్ పవర్ జూలై 17 :** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వ్యాప్తంగా వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత ట్రైసైకిళ్ల పంపిణీ కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగుతోంది. ఈ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులు మరో ఇద్దరు దివ్యాంగులకు ఉచితంగా ట్రైసైకిళ్లను అందజేశారు. మధుమేహం (డయాబెటిస్) కారణంగా కాళ్లు కోల్పోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఇద్దరు బాధితుల పరిస్థితిని తెలుసుకున్న వేమిరెడ్డి దంపతులు, వారి కదలికలకు ఆసరాగా ట్రైసైకిళ్లను పంపిణీ చేసి మరోసారి తమ సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. ట్రైసైకిళ్లు అందుకున్న వారిలో కందుకూరు నియోజకవర్గం, ఉలవపాడు మండలం, రామాయపట్నం (రెడ్డిపాలెం) గ్రామానికి చెందిన పంతంగి శ్రీనివాసులు, అలాగే ఉదయగిరి నియోజకవర్గం, ఉదయగిరి టౌన్‌లోని మాదిగపాలెంకు చెందిన నగిల్లా రామయ్య ఉన్నారు. ట్రైసైకిళ్లు అందుకున్న లబ్ధిదారులు తమకు అండగా నిలిచిన వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ రెండు ట్రైసైకిళ్లతో కలిపి వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,040 మంది దివ్యాంగులకు ఉచిత ట్రైసైకిళ్లను అందజేసి వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపారు.

# ప్రజలకు చేరువగా ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమం జిల్లా కలెక్టర్ డా.లక్ష్మీశ, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు





**విజయవాడ, పెన్ పవర్, జులై, 17 :** ప్రజల సమస్యలను స్థానికంగానే స్వీకరించి త్వరితగతినపరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న "ఒక నెల -- ఒక నియోజకవర్గం -- నాలుగు సందర్శనలు" కార్యక్రమంలో భాగంగా విజయవాడ తూర్పు నియోజకవర్గంలోని కృష్ణలంకలోని అమరజీవి పొట్టి శ్రీరాములు మున్సిపల్ కార్పొరేషన్ హై స్కూల్ నందు శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమానికి కలెక్టర్ లక్ష్మీశ, స్థానిక శాసనసభ్యులు గద్దె రామ్మోహన్, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, అధికారులతో కలిసి పాల్గొని ప్రజల నుండి వివిధ సమస్యలకు సంబంధించిన అర్జీలు, వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ, ఒక్కో నియోజకవర్గంలో నాలుగు శుక్రవారాలు ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉండగా, విజయవాడ తూర్పు నియోజకవర్గంలో ఇప్పటికే రెండు విడతలుగా విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. గత రెండు విడతలుగా నిర్వహించిన పీజిఆర్ఎస్ సమావేశాల్లో వరుసగా 94, 66 అర్జీలను స్వీకరించడం జరిగిందని,ఈ రోజు స్వీకరించిన 86 దరఖాస్తులతో కలిపి మొత్తం 246 అర్జీలను స్వీకరించడం జరిగిందని, వీటిలో ఇప్పటి వరకు 57 అర్జీలను పరిష్కరించడం జరిగిందని, మిగతా దరఖాస్తులు వివిధ పరిష్కార దశల్లో ఉన్నాయని తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం దూర ప్రాంతాలకు వెళ్లి సమయం, డబ్బు వృథా చేసుకోకుండా, ప్రభుత్వమే వారి వద్దకు వచ్చి సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు ఈ ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టిందన్నారు. ప్రజలకు అందుబాటులో ప్రభుత్వ సేవలను తీసుకురావడమే ఈ కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని వివరించారు. అధికారులు ప్రజల నుండి వచ్చిన ప్రతి అర్జీని పూర్తిగా చదివి, నాణ్యమైన పరిష్కారం అందించాల్సిన బాధ్యత ఉందని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఒకే సమస్యపై ప్రజలు పదేపదే దరఖాస్తులు చేసుకునే పరిస్థితి రాకుండా సమస్యలను సమగ్రంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విజయవాడ తూర్పు నియోజకవర్గశీ శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ రావు మాట్లాడుతూ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు తక్షణ పరిష్కారం అందించాలనే ఉద్దేశంతో మన ముఖ్యమంత్రి తీసుకునే కొన్ని విప్లవాత్మకమైన నిర్ణయాలలో ప్రత్యేక పీజీఆర్ఎస్ కార్యక్రమం కూడా ఒకటి అన్నారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌కు వెళ్లి అర్జీలు సమర్పించడం ప్రజలకు కొంత ప్రయాసతో కూడుకున్న విషయమని, దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నియోజకవర్గ స్థాయిలోనే పీజీఆర్ఎస్ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేసిందన్నారు. జిల్లా స్థాయి అధికారులందరూ నియోజకవర్గానికి రావడం, స్థానిక అధికారులు సమన్వయంతో పనిచేయడం వల్ల సమస్యల పరిష్కారం మరింత వేగవంతంగా, సులభంగా జరుగుతుందని శాసనసభ్యులు తెలిపారు. సమస్యలను బాధ్యతాయుతంగా పరిష్కారానికి కృషి చేస్తున్నందుకు అధికారులకు అభినందనలు తెలిపారు. నూటికి 90 శాతంకు పైబడి పెన్షన్లు, ఇళ్ల స్థలాలు మంజూరుకు, 10% దరఖాస్తులు వ్యక్తిగత సమస్యలు వస్తున్నాయని తెలిపారు. రానున్న ఒకటి, రెండు నెలల్లో 2.50 లక్షల పెన్షన్లు మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. రెండు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాల మంజూరుకు కూడా జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈరోజు అందిన 86 దరఖాస్తుల్లో 30 దరఖాస్తులు ఇళ్ల స్థలాలు మంజూరుకు, 47 దరఖాస్తు పింఛన్లు మంజూరుకు అందగా, మిగిలిన దరఖాస్తులు వివిధ సమస్యలపై అందినట్లు శాసనసభ్యులు వివరించారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు జిల్లా కలెక్టర్ స్వయంగా వివిధ కౌంటర్ల వద్ద జరుగుతున్న అర్జీల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. అర్జీదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, సావధానంగా రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ముఖ్యంగా వృద్ధులు, వికలాంగులు కౌంటర్ల వద్దకు వచ్చినప్పుడు వారికి కూర్చునే సౌకర్యం కల్పించి, ప్రాధాన్యతతో సేవలు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఆర్డీవో వెన్నెలశ్రీను, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి జి.జ్యోతి, వీఎంసి జోనల్ కమిషనర్ షామీ, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, వార్డు స్థాయి అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కి స్వాగతం పలికిన జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



**గుంటూరు, పెన్ పవర్, జులై, 17 :** పల్నాడు జిల్లా నరసరావుపేటలో నిర్వహించిన భారీ క్రెడిట్ అవుట్‌రీచ్ కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా గారు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కి సాదర స్వాగతం పలికి కార్యక్రమంలో పాల్గొన్నారు హెలి ప్యాడ్ నందు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ,జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా గారిని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కి ప్రత్యేకంగా పరిచయం చేయడం విశేషం.అనంతరం కేంద్ర మంత్రి, ముఖ్యమంత్రికి జెడ్పీ చైర్‌పర్సన్ శుభాభివందనం తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, మహిళా స్వయం సహాయక సంఘాలు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, చిన్న వ్యాపారులు తదితర లబ్ధిదారులకు రూ. 3,216 కోట్ల విలువైన రుణాల మంజూరుకు సంబంధించిన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులకు రుణ మంజూరు పత్రాలను అందజేశారు.

## ఆర్యవైశ్య వాసవి సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా గూడూరు కిషోర్ కుమార్



**నాయుడుపేట, పెన్ పవర్, జూలై 17 :** ఆర్యవైశ్య వాసవి సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా తిరుపతి జిల్లా రూరల్ ఆర్యవైశ్య సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు గూడూరు కిషోర్ కుమార్ నియమితులయ్యారు.ఈ సందర్భంగా గూడూరు కిషోర్ కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఆర్యవైశ్య వాసవి సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమించిన రాష్ట్ర అధ్యక్షులు దుంప కుంట్ల శబరి వరప్రసాద్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆర్యవైశ్య వాసవి సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పదవి సమాజ సేవ చేసేందుకు తనకు లభించిన గొప్ప అవకాశంగా భావిస్తున్నట్లు తెలియజేశారు. మిత్రులు,సంఘ సభ్యులు, శ్రేయోభిలాషులు సహకారంతో ఆర్యవైశ్య వాసవి సేవాదళ్ ప్రతిష్టను పెంపొందించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలియజేశారు.

# ఫసల్ బీమాతో అన్నదాతకు ఆర్థిక ధీమా జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ




**విజయవాడ, పెన్ పవర్, జులై, 17 :** ఆపత్కాలంలో అండగా నిలిచే పంట బీమా పథకాలను అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని.. రుణం తీసుకునే రైతులతో పాటు రుణేతర రైతులు కూడా తప్పనిసరిగా పథకాల్లో చేరాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని శ్రీ పీవీఎస్ రెడ్డి హాల్‌లో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన వ్యవసాయ, ఉద్యాన, సహకార, బ్యాంకింగ్, బీమా సంస్థల అధికారులతో సమావేశం జరిగింది. ఎల్‌నినో ప్రభావం వంటి పరిస్థితుల నేపథ్యంలో పంట నష్టాల ప్రమాదం పెరిగే అవకాశం ఉన్నందున రైతులకు ఫసల్ బీమాపై విస్తృత అవగాహన కల్పించాలని ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, పునర్నిర్మించిన వాతావరణ ఆధారిత పంట బీమా పథకాల్లో చేరేలా ప్రోత్సహించాలన్నారు. ఇందుకు సమన్వయ శాఖల అధికారులు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని ఆదేశించారు. ఖరీఫ్-2026 సీజన్‌కు జిల్లాలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద వరి, ఎర్రమిరప, మొక్కజొన్న, పెసర పంటలను నోటిఫై చేయడం జరిగిందని.. అదేవిధంగా పునర్నిర్మించిన వాతావరణ ఆధారిత పంట బీమా పథకం కింద పత్తిని నోటిఫై చేసినట్లు వివరించారు. వీటితో అతి తక్కువ ప్రీమియంతోనే కష్టకాలంలో అధిక ఆర్థిక భరోసా లభించనుందని.. ఉదాహరణకు వరికి ఎకరాకు బీమా మొత్తం రూ. 42,500 కాగా రైతు వాటా ప్రీమియం రూ. 850 చెల్లిస్తే సరిపోతుందన్నారు. వరికి సంబంధించి పథకంలో నమోదుకు ఆగస్టు 15వ తేదీ ఆఖరు తేదీ కాగా ఎర్ర మిరప, మొక్కజొన్న, పెసరకు జులై 31 చివరితేదీ అని తెలిపారు. పత్తికి ఈ నెల 24వ తేదీలోగా నమోదుచేయించుకోవాల్సి ఉంటుందని వివరించారు. పంట రుణం తీసుకున్న రైతులకు రుణంతో పాటు అదనంగా బీమా ప్రీమియం కూడా మంజూరవుతుందని.. పంట రుణాలు తీసుకోని రైతులు నమోదుకు బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, కామన్ సర్వీస్ సెంటర్లు, జాతీయ పంట బీమా పోర్టల్, స్వర్ణ గ్రామం, తపాలా కార్యాలయాలను ఉపయోగించుకోవచ్చన్నారు. పంట రుణాలు తీసుకోని రైతుల కోసం స్వీయ ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుందని సూచించారు. పథకాలకు సంబంధించిన సమాచారం, సందేహాల నివృత్తి కోసం స్థానిక వ్యవసాయ అధికారులను సంప్రదించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, జిల్లా ఉద్యాన అధికారి పి.బాలాజీ కుమార్, జిల్లా ఎకనమిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ అధికారి డీవీ శివరామ ప్రసాద్, గరికపాడు కేవీకే శాస్త్రవేత్త డా. ఐ.వెంకటరెడ్డి, ప్రగతిశీల రైతు యు. మాధవరావు, యూబీఐ సీనియర్ మేనేజర్ అబ్దుల్ సలామ్, టాటా ఏఐజీ ఇన్సూరెన్స్, ఇఫ్కో టోకియో జనరల్ ఇన్సూరెన్స్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## "మన డబ్బులు - మన లెక్కలు"పై మండల స్థాయి అవగాహన కార్యక్రమం



**యద్దనపూడి, పెన్ పవర్, జూలై 17 :** యద్దనపూడిలోని స్థానిక వెలుగు కార్యాలయంలో మండల సమైక్య అధ్యక్షురాలు బి. కృష్ణవేణి అధ్యక్షతన మన డబ్బులు -- మన లెక్కలు కార్యక్రమంపై మండల స్థాయి అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి సంఘ సభ్యురాలికి సూపర్ నారి యాప్‌ను ఇన్‌స్టాల్ చేసి, సభ్యురాలి ఎంబీకే ఐడీతో లాగిన్ అయ్యే విధానాన్ని వివరించారు. యాప్ ద్వారా సభ్యురాలి వ్యక్తిగత వివరాలు, గ్రూపు సమాచారం, పొదుపు వివరాలు, గ్రూపు మొత్తం పొదుపు, తీసుకున్న రుణాలు, చెల్లించిన మొత్తం, మిగిలిన బకాయిలను సులభంగా పరిశీలించవచ్చని తెలిపారు. వివరాల్లో ఏవైనా తేడాలు ఉంటే యాప్ ద్వారానే ఫిర్యాదు నమోదు చేసుకునే సదుపాయం కూడా అందుబాటులో ఉందని ఏపీఎం జె. కామేశ్వరి వివరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యద్దనపూడి ఎంపీడీవో బి. శ్రీనివాసులు మాట్లాడుతూ, మహిళా సంఘ సభ్యులందరూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందాలని సూచించారు. అలాగే సంఘ సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ సంఘాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. తహశీల్దార్ కె. రవికుమార్ మాట్లాడుతూ, సభ్యులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి మంచి క్రెడిట్‌ను కొనసాగించాలని, తద్వారా అధిక మొత్తంలో బ్యాంకు రుణాలు పొందే అవకాశాలను వినియోగించుకుని మహిళలు ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సంఘ సహాయకులు, సీసీలు, అకౌంటెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

## వేటపాలెంలో నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేత

**వేటపాలెం, పెన్ పవర్, జూలై 17 :** విద్యుత్ లైన్ల మరమ్మత్తు పనుల కారణంగా నేడు (శనివారం జూలై 18) ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వేటపాలెం పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆపరేషన్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజినీర్ తెలిపారు. విజయనగర్ కాలనీ, రామానగర్, చిన్న మాలపల్లి, పెద్ద మాలపల్లి, మంకెన మాలపల్లి, రావూర్ రోడ్డు, రెడ్డి స్ట్రీట్, అనిమల్ పేట, తుఫాన్ పేట, రైల్వే స్టేషన్ పరిసరాలు, వేటపాలెం టౌన్ ప్రాంతాల్లో ఈ సమయంలో విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. మరమ్మత్తు పనులను త్వరితగతిన పూర్తి చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని, ఈ నేపథ్యంలో వినియోగదారులు సహకరించాలని ఆపరేషన్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజినీర్ విజ్ఞప్తి చేశారు.

## ప్రజా దర్బార్ లో అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు, పెన్ పవర్, జులై, 17 :** గుంటూరు తూర్పు నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి, వారి జీవనోపాధి మెరుగుపరచడమే ప్రజా దర్బార్ లక్ష్యమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో చేపట్టిన ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని స్థానిక తూర్పు కార్యాలయంలో నిర్వహించారు. అన్ని డివిజన్ల లో సమస్యలను స్వయంగా ఆలకించారు. శానిటేషన్, విద్యుత్ సరఫరా, రోడ్లు వంటి అవసరాల గురించి ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. కొందరు జీవనోపాధి కల్పించాలని అర్జీలు అందజేశారు. వారికి అవసరమైన ఆర్థిక శక్తి అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే నసీర్ హామీ ఇచ్చారు. ప్రజాదర్బార్లో అందించిన సమస్యల పరిష్కారానికి వెంటనే కృషి చేస్తామన్నారు.

## కోవిడ్‌పై ఆందోళన వద్దు.. అప్రమత్తంగా ఉందాం : జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ, పెన్ పవర్, జులై, 17:** రాష్ట్రంలో కోవిడ్ కేసులు వెలుగుచూస్తున్న నేపథ్యంలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అయితే ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండి అవసరమైన ముందు జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సూచించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తోందని.. ఎవరూ భయపడాల్సిన పనిలేదని, ముందు జాగ్రత్తగా విజయవాడ జీజీహెచ్‌లో 15 పడకలతో ప్రత్యేక కోవిడ్ వార్డు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వైద్యులు, సిబ్బందితో పాటు అవసరమైన మందులు, ఉపకరణాలు



అన్నింటినీ సిద్ధంగా ఉంచినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే దాదాపు 45 మందికి పరీక్షలు చేసినా ఎవరికీ పాజిటివ్ రాలేదన్నారు. అయినా ముందస్తు చర్యల్లో భాగంగా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉన్నట్లు తెలిపారు. జ్వరం, దగ్గు, గొంతు నొప్పి, శ్వాస సంబంధిత ఇబ్బందులు వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా సమీప ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్యుల సలహా తీసుకోవాలని సూచించారు. వృద్ధులు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు మరింత జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. చేతులు శుభ్రంగా కడుక్కోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, అవసరమైన చోట మాస్క్ ధరించడం వంటి జాగ్రత్తలను పాటించాలని సూచించారు. వదంతులను నమ్మకుండా అధికారిక సమాచారం మాత్రమే విశ్వసించాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు.

## నేడు భట్టిప్రోలులోస్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర

**భట్టిప్రోలు, పెన్ పవర్ జులై, 17 :** ప్రతినెల మూడవ శనివారం ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించబడుతున్న స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం ఉదయం భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయం వద్ద నుండి ప్రారంభించడం జరుగుతుందని భట్టిప్రోలు మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి ఎస్.వెంకటరమణ పేర్కొన్నారు. శుక్రవారం ఆమె ఒక ప్రకటనలో ఈ విషయాన్ని తెలియజేస్తూ



వర్షాకాలం పురస్కరించుకుని ప్రజలు తమ సమీప ప్రాంతాల్లో నీరు నిలవ లేకుండా చూసుకోవాలని ఆరోగ్య సిబ్బంది ఎప్పటికప్పుడు వారి ప్రాంతంలో సంచరిస్తూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండలంలోని అధికారులు గ్రామ పంచాయతీల కార్యదర్శులు అంగన్వాడీ కార్యకర్తలు ఆశా కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

## చీరాల తీరానికి రూ.250 కోట్ల నోవోటెల్ బీచ్‌ఫ్రంట్ హోటల్

### అకార్ -శ్రీ భ్రమర గ్రూప్స్ మధ్య ఒప్పందం

**చీరాల, పెన్ పవర్, జూలై 17 :** చీరాల సమీపంలోని గవినివారిపాలెంలో రూ.250 కోట్ల వ్యయంతో అంతర్జాతీయ స్థాయి నోవోటెల్ బీచ్‌ఫ్రంట్ హోటల్ నిర్మాణానికి ప్రపంచ ప్రఖ్యాత హాస్పిటాలిటీ సంస్థ అకార్ మరియు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శ్రీ భ్రమర గ్రూప్ మధ్య శుక్రవారం న్యూఢిల్లీలో ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంపై అకార్ ప్రతినిధులు, శ్రీ భ్రమర గ్రూప్స్ ఎండీ గళ్ళా రామచంద్రరావు సంతకాలు చేశారు.




కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పాల్గొన్నారు. 3.15 ఎకరాల సముద్రతీర ప్రాంతంలో నిర్మించనున్న ఈ ప్రాజెక్టులో 225 నుంచి 250 వరకు అతిథి గదులు, లగ్జరీ సూట్లు, అత్యాధునిక రెస్టారెంట్లు, విందు, సమావేశ మందిరాలు, స్విమ్మింగ్ పూల్, స్పా, ఫిట్‌నెస్ సెంటర్‌తో పాటు పలు వినోద సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతంలోనే అతిపెద్ద అంతర్జాతీయ బ్రాండెడ్ హాస్పిటాలిటీ ప్రాజెక్టుల్లో ఒకటిగా ఇది నిలవనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా చీరాల ప్రాంతానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడంతో పాటు పర్యాటక రంగానికి కొత్త ఊపు వస్తుందని, స్థానిక యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కలుగుతాయని, ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ, రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడం, పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ఈ ప్రాజెక్టు ముందుకు రావడం శుభపరిణామమని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ప్రభుత్వం రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని కల్పిస్తోందని, అందువల్లే దేశీయ, విదేశీ సంస్థలు ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయని పేర్కొన్నారు. చీరాల తీర ప్రాంత అభివృద్ధికి ఈ ప్రాజెక్టు మైలురాయిగా నిలుస్తుందని ఆమె అభిప్రాయపడ్డారు.

## సీనియర్ మెడికల్ ఆఫీసర్‌గా డాక్టర్ నాగార్జున

గుంటూరు మెడికల్: ఐదు జిల్లాల పరిధి వరకు విస్తరించి ఉన్న గుంటూరు సీ.జీ.హెచ్.ఎస్ (సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీం) వెల్ నెస్ కార్యాలయంలో సీనియర్ మెడికల్ ఆఫీసర్‌గా సేవలందిస్తున్న డాక్టర్ కొండా నాగార్జున చీఫ్ మెడికల్ ఆఫీసర్ (సీ.ఎం.ఓ) గా పదోన్నతి పొందారు. ఆయనను గుంటూరుకు కేటాయిస్తూ శుక్రవారం కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శనివారం అధికారికంగా గుంటూరు నగరంపాలెంలోని సీ.జీ.హెచ్ ఎస్ కార్యాలయం లో సీ.ఎం.ఓ గా ఆయన బాధ్యతలు స్వీకరిస్తారు. నాలుగు రోజుల క్రితం నెల్లూరు సీ.జీ.హెచ్.ఎస్ నుంచి బదిలీ పై వచ్చిన దాసరి రమేష్ సీ.ఎం.ఓ గా ప్రస్తుతం గుంటూరులో విధులు నిర్వహిస్తున్నారు. కొండా నాగార్జునకు కూడా పదోన్నతి లభించడంతో సీ.జీ.హెచ్.ఎస్ కేంద్రాలలో ఎక్కడా లేని విధంగా గుంటూరులో ఇద్దరు సీ.ఎం.ఓ లు విధులు నిర్వహించడం విశేషం. పదోన్నతి పొందిన కొండా నాగార్జున ను గుంటూరు సీ.జీ.హెచ్.ఎస్ లోకల్ ఎడ్వైజరీ కమిటీ మెంబర్లు గుమ్మడి సీతారామయ్యచౌదరి, కట్టా వెంకటేశ్వర్లు, పలువురు ఉద్యోగులు, పెన్షనర్లు, వైద్య సిబ్బంది పుష్పగుచ్చాలు ఇచ్చి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ గుంటూరు సీ.జీ.హెచ్.ఎస్ పరిధిలోని గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, మార్కాపురం జిల్లాలలోని వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగులు, పెన్షనర్లకు వైద్య పరంగా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

## ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులుగా మారుటూరి

బాపట్ల: బాపట్ల జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా మారుటూరి రాఘవేంద్రరావును నియమిస్తూ సంఘం నిర్ణయం తీసుకుంది. ఈమేరకు సంఘం కార్యాలయంలో నూతన కమిటీని నియమించారు. అధ్యక్షులుగా చీరాలకు చెందిన మారటూరి రాఘవేంద్రరావు, ప్రధాన కార్యదర్శిగా బాపట్లకు చెందిన నాగవరపు పవన్‌కుమార్‌ను నియమించారు. సమావేశంలో ఐవీఎఫ్ రాష్ట్ర రాజకీయ చైతన్య కమిటీ చైర్మన్ వెల్లంపల్లి సత్యనారాయణ, ఐవీఎఫ్ బాపట్ల జిల్లా కోశాధికారి కోళ్లపూడి శివనారాయణ, బాపట్ల జిల్లా కమిటీ కోశాధికారి గుప్తా, తటవర్తి బ్రహ్మం, బూర్లే అనిల్‌కుమార్, గుండ శ్రీనివాసరావు, ఊటుకూరు వెంకటేశ్వర్లు, నాగవరపు నిఖిల్ తదితరులు పాల్గొన్నారు. విద్యుదాఘాతానికి కార్మికుడు బలి మార్టూరు: విద్యుదాఘాతంతో ఓ గ్రానైట్ కార్మికుడు మృతి చెందిన ఘటన శుక్రవారం మార్టూరులో జరిగింది. అందిన వివరాల మేరకు.. ఒడిశా రాష్ట్రం మయూర్ గంజ్ జిల్లా భోలా గడియ గ్రామానికి చెందిన అనంత్ కిస్క్ (21) గత కొంతకాలంగా మార్టూరులోని ఓ గ్రానైట్ ఫ్యాక్టరీలో కార్మికుడిగా పనిచేస్తున్నారు. ఫ్యాక్టరీలో విద్యుత్ మరమ్మతులు చేస్తున్న క్రమంలో వారికి సహాయంగా ఇనుప నిచ్చెన మోసుకుని వెళుతున్న అనంత్ కిస్క్ పైన ఉన్న హై టెన్షన్ తీగలు నిచ్చెనకు తగలడంతో షాక్ తగిలి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అనంత్‌తో పాటు స్వల్పంగా గాయపడిన మరొక కార్మికుడితో కలిపి ఇద్దరిని స్థానికులు చిలకలూరిపేట ప్రైవేట్ హాస్పిటల్ కి తరలించారు. పరీక్షించిన వైద్యులు అనంత్ అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మార్టూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సబ్ జైలు సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు మృతి భార్యాభర్తలను కలిపిన శక్తి టీం న్యాయవాదులకు ఈ ఫైలింగ్‌లో మెళకువలు గుంటూరులీగల్: జిల్లా కోర్టులోని న్యాయవాదులకు ఈ--ఫైలింగ్ విధానం, అందులో పాటించాల్సిన ముఖ్యమైన మెళకువలు, సాంకేతిక అంశాలపై శుక్రవారం ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. ఆగస్టు 1వ తేదీ నుండి బెయిల్ పిటిషన్లు, క్రిమినల్ అప్పీళ్లకు ఈ--ఫైలింగ్ విధానం తప్పనిసరి అవుతుందని తెలిపారు. ఈ--ఫైలింగ్ విధానం ద్వారా న్యాయ ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందన్నారు.

## యాప్‌ను సద్వినియోగం చేసుకోండి : వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

మాచర్ల: రాష్ట్రంలో అధికార పార్టీ రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో అందర్నీ అణగదొక్కుతోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. పార్టీ సోషల్ మీడియా ప్రతినిధులపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నందున ప్రతి కార్యకర్తతో పార్టీ నాయకత్వం అనుసంధానం అయ్యేలా జగన్ 2.0 యాప్‌ను మాజీ సీఎం జగన్ ప్రవేశపెట్టారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు దీనిని ఉపయోగించుకోవాలని సూచించారు. శుక్రవారం మాచర్లలోని క్యాంపు కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలసి ఆయన యాప్ పోస్టర్ ఆవిష్కరించారు. తర్వాత విలేకరులతో మాట్లాడుతూ... టీడీపీ నాయకులు అత్యంత దారుణంగా రాజకీయాలు చేస్తూ తమ పార్టీ వారిపై కుట్రలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. సోషల్ మీడియాలో వైఎస్సార్‌సీపీ కంటెంట్‌ను డిలీట్ చేసి కుట్రలు పన్నుతున్న నేపథ్యంలోనే జగన్ 2.0 యాప్‌ను ఆవిష్కరించారన్నారు. అందర్నీ చైతన్యపరచి ఈ యాప్‌లో భాగస్వాములను చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తాడి వెంకటేశ్వరరెడ్డి, యరబోతుల శ్రీనివాసరావు, పల్లపాటి గురుబ్రహ్మం, బోయ రఘురామిరెడ్డి, అబ్దుల్ జలీల్, బూడిద శ్రీను, పోతురెడ్డి కోటిరెడ్డి, నల్ల వెంకటరెడ్డి, మందా సంతోష్, మాచర్ల సుందరరావు, షేక్ మస్తాన్, పిల్లి కొండలు, బూదాల మరియమ్మ, అల్లి జీవన్, మైనార్టీ నాయకులు అబ్దుల్ సత్తార్, చికెన్ బాజి, నాయకులు మోరా రామకృష్ణారెడ్డి, కొంగర సుబ్రహ్మణ్యం, కొండా శివలింగరాజు, ఇంద్ర గౌడ్, బాలమ్మ, అనంతరావమ్మ, కారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, చిన్న బద్రు, దుర్గ, దేగ శివ, వేల్పుల గురవయ్య, కొమ్ము వెంకటేశ్వర్లు (బొంగురు), పులిమెల మాణిక్యం, సభావత్ రవినాయక్, సుబ్రహ్మణ్యం నాయక్, వై. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**యాప్ డౌన్‌లోడ్ చేసుకునే విధానం ఇదీ :** గూగుల్ ప్లే స్టోర్‌లో 'జగన్ 2.0 సూపర్ యాప్' అని టైపు చేయగానే వైఎస్ జగన్ చిత్రంతో కూడిన యాప్ కనిపిస్తుంది. దానిని డౌన్‌లోడ్ చేసుకుని ఇన్‌స్టాల్ చేసుకోవాలి. అనంతరం సెల్ నంబరు, ఓటీపీ నమోదు చేయాలి. యాప్ వినియోగించే వారి పేరు నమోదు చేసుకుని, ప్రొఫైల్ క్రియేట్ చేసుకోవాలి. తద్వారా ఎప్పటికప్పుడు రాష్ట్రంలో జరుగుతున్న తాజా పరిణామాలు, ముఖ్యమైన సంఘటనల గురించి తెలుసుకోవచ్చు.

## ఆక్వా, పొగాకు రైతు సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం : ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

అమరావతి, జులై 17: ఆక్వా, పొగాకు రైతు సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని లోక్‌సభలో టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు వెల్లడించారు. శుక్రవారం ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన టీడీపీ పార్లమెంటరీ భేటీ జరిగింది. ఈ భేటీ అనంతరం ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ.. కేంద్ర ప్రాయోజిత పథకాలు సద్వినియోగం చేసుకునేలా సమగ్ర కార్యాచరణ రూపొందించుకుని కృషి చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారని తెలిపారు. సోషల్ మీడియా వేదికగా మహిళలపై జరుగుతున్న వ్యక్తిత్వ హననాన్ని తెలుగుదేశం పార్టీ సీరియస్‌గా తీసుకుందని వివరించారు. దీనిపై పార్లమెంట్ వేదికగా గళమెత్తుతామని చెప్పారు. షెల్ కంపెనీలు పెట్టి మోసగించే అంశాలను కూడా పార్లమెంట్‌లో లేవనెత్తుతామని పేర్కొన్నారు. మహిళ



రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజన బిల్లులు సహా కేంద్రం పెట్టే వివిధ బిల్లులకు మద్దతుగా నిలవాలని ఈ సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. మహిళ రిజర్వేషన్ బిల్లు వ్యతిరేకించిన ప్రతీ పార్టీ.. ఆయా రాష్ట్రాల ఎన్నికల్లో ఓడిపోవడం చూశామని అన్నారు. కాబట్టి ఈసారి ఆ పరిస్థితి ఉండదని భావిస్తున్నామని చెప్పారు. పోలవరం, అమరావతికి నిధుల సాధనకు కృషి చేయటంతో పాటు ప్రధాని చేతుల మీదుగా ప్రారంభం కానున్న భోగాపురం విమానాశ్రయం అంశంపై చర్చించామని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు.

**టీమ్ వర్క్‌గా పని చేస్తున్నాం : ఎంపీ కలిశెట్టి**

రాష్ట్రంలోని పెండింగ్ సమస్యలపై మరింత దృష్టి పెట్టాలని తమకు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. టీడీపీపీ భేటీ అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు పెట్టిన బాధ్యతలు నెరవేర్చటానికి తామంతా టీమ్ వర్క్‌గా పని చేస్తున్నామని చెప్పారు. ఈ రెండేళ్లు పార్లమెంట్‌లో బాగా పని చేశారని సీఎం చెప్పారని పేర్కొన్నారు. దిల్లీ వేదికగా రాష్ట్ర పరువు తీయటమే లక్ష్యంగా వైఎస్ జగన్ పని చేశారని మండిపడ్డారు. రాష్ట్ర పరువు ఎలా తీయాలని వైఎస్ జగన్ చెబుతారంటూ వ్యంగ్యంగా అన్నారు. సీఎం చంద్రబాబు అభివృద్ధి కోసం మాట్లాడతారని తెలిపారు. కానీ వైఎస్ జగన్ పారిశ్రామిక వేత్తలను ఎలా తరమాలని చెబుతారని ఎద్దేవా చేశారు.

## గ్రేడ్-2 బీసీ హాస్టల్ వార్డెన్లకు కూటమి ప్రభుత్వం గుడ్ న్యూస్..

అమరావతి, జులై 17: గ్రేడ్-2 బీసీ హాస్టల్ వార్డెన్లకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. పదోన్నతుల కల్పనకు సర్వీస్ రూల్స్‌ను సడలిస్తూ ప్రభుత్వం ఈరోజు(శుక్రవారం) ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని 300 మందికి పైగా గ్రేడ్-2 హాస్టల్ వార్డెన్లు పదోన్నతులు పొందే అవకాశం ఉంది. గత కొంతకాలంగా సర్వీస్ రూల్స్ సడలించాలని గ్రేడ్-2 హాస్టల్ వార్డెన్లు ప్రభుత్వాన్ని కోరుతున్న విషయం తెలిసిందే. 2008 నుంచి ఈ అంశంపై వార్డెన్లు సర్కార్‌కు విజ్ఞప్తులు చేస్తూ వస్తున్నారు. తాజాగా కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో గ్రేడ్ 2 హాస్టల్ వార్డెన్లకు ఉపశమనం లభించినట్లైంది. ఈ సందర్భంగా తమ సమస్య పరిష్కారానికి కృషి చేసిన మంత్రి సవితకు గ్రేడ్-2 హాస్టల్ వార్డెన్లు ధన్యవాదాలు తెలియజేశారు. కూటమి ప్రభుత్వ నిర్ణయంతో వార్డెన్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## విజన్ బిల్డింగ్-బిజినెస్ డెవలప్మెంట్ ప్లాన్ పై శిక్షణ




**భట్టిప్రోలు, పెన్ పవర్ జులై, 17:** మండల సమాఖ్యలోని సంఘములు మరియు సభ్యులు, ద్వాక్రా మహిళలు వ్యాపార అభివృద్ధికి తీసుకున్న ఋణాలను సక్రమంగా వినియోగించుకుంటూ సంబంధిత వ్యాపారాలలో లాభాలు సంపాదించే దిశగా ముందుకు సాగాలని భట్టిప్రోలు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ గుడిమెట్ల శ్రీమన్నారాయణ తెలిపారు.శుక్రవారం మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో రెండవరోజు శిక్షణా కార్యక్రమం మండల సమాఖ్య అధ్యక్షురాలు ఇండ్ల కుమారి అధ్యక్షతన విజన్ బిల్డింగ్- బిజినెస్ డెవలప్మెంట్ ప్లాన్ గురించి రెండవరోజు ఎంఎస్. ఈసీ సభ్యులు,వివో ఏలకు,సి సి లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించటం జరిగింది.ఈ కార్యక్రమంలో ఏటీఎం శ్రీమన్నారాయణ మాట్లాడుతూ ఒక ఆదర్శ గ్రామం లేదా గ్రామ సంఘంకు 8 కార్యక్రమాలు తప్పనిసరిగా అమలు చేయాలని తెలియచేశారు. ఆరోగ్యం,విద్య, వ్యవసాయం,సామాజికభద్రత,ఆస్తుల సృష్టి,పరివర్తనలో మార్పు,సుస్థిర జీవనోపాదులు, సామర్థ్యాల పెంపు అనే 8 అంశాలపై ఎం ఎస్ ఇ సి సభ్యులను 4 టీమ్ లుగా విభజించి ఒకొక్క టీమ్ కు రెండు అంశాలను కేటాయించి ఆ అంశాలను పూర్తి స్థాయిలో వివరించి చార్టులపై వ్రాయించి ప్రదర్శించడం జరిగింది. తదనంతరం చిన్నసంఘాలు, గ్రామసంఘాలు, మండల సమాఖ్యలు, మహిళా వ్యాపారవేత్తలు తీసుకున్న ఋణాలు వినియోగించి చేపట్టే కార్యక్రమాలలో లాభాలలో ప్రయాణించేందుకు చేయవలసిన కార్యక్రమాలను క్రీడల రూపంలో చూపించటం జరిగింది.(రింగ్ఆట, చెక్కముక్కలుఆట) ఈ కార్యక్రమంలో ఎం ఎస్ ఇ సి సభ్యులు,వివో ఏ లు,సిసి లు,ఎం ఎస్ ఏ లు తదితరులు పాల్గొన్నారు.

## మూలాంకురేశ్వరికి విశేష పూజలు

ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్ గ్రామంలోని మూలాంకురేశ్వరి అమ్మవారికి ఆషాఢ మాస శుక్రవారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అర్చకులు అయ్యన్నశాస్త్రి, కార్తీక్‌శాస్త్రిలు అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించారు. పసుపు, కుంకుమలతో లలిత అష్టోత్తర, సహస్రనామ అర్చనలు చేశారు. ముఖమండపంలో ఉన్న శ్రీచక్రానికి ఖడ్గమాల స్తోత్రంతో కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తుల గోత్రనామాలతో పూజలు చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు.

## శాకంబరి వారాహి మాతగా బగళాముఖి

చందోలు(కర్లపాలెం): బాపట్ల జిల్లా చందోలు గ్రామంలో ప్రసిద్ధిగాంచిన బగళాముఖి అమ్మవారి ఆలయంలో వారాహి నవరాత్ర మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం మూడవ రోజున అమ్మవారు శాకంబరి వారాహిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శాకంబరి దేవి అలంకరణ కోసం సుమారు 800 కిలోల పలు రకాల కూరగాయలు, పండ్లు వినియోగించారు. మూడవ రోజున రాష్ట్రంలోని నలుమూలల నుంచి భక్తులు అమ్మవారి ఆలయానికి చేరుకుని ప్రదక్షిణలు చేశారు. నవరాత్ర మహోత్సవాలలో భాగంగా ఆలయ అర్చకులు వారాహి హోమం విశేష పూజలు నిర్వహించారు. చందోలు గ్రామానికి చెందిన సుమారు 60 మంది ఆర్యవైశ్య మహిళలు సంప్రదాయ బద్ధంగా సారెలు, పూజా ద్రవ్యాలు శిరస్సున ధరించి మంగళ వాయిద్యాలతో శోభాయాత్రగా ఆలయానికి చేరుకుని విశేష పూజల అనంతరం అమ్మవారికి సమర్పించారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఒంగోలుకు చెందిన తెల్లపాటి శ్రీనివాసరావు, కనకదుర్గ దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు మహాఅన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## 20న జగన్నాథ రథయాత్ర

తెనాలి టౌన్: ఇస్కాన్ టెంపుల్ తెనాలి ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీన పట్టణంలో శ్రీశ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. స్థానిక నాజరుపేటలోని టెంపుల్‌లో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆలయ ఇన్‌చార్జి సింహ గౌరదాస్ వివరాలను తెలిపారు. 20వ తేదీ మధ్యాహ్నం 12.30 గంటలకు పట్టణ శివాజీచౌక్‌లో ఇందుకు సంబంధించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభమవుతాయని చెప్పారు. 2 గంటల నుండి శ్రీశ్రీ జగన్నాథ ర?థయాత్ర మహోత్సవం ప్రారంభమవుతుందని వెల్లడించారు. శివాజీచౌక్, గాంధీచౌక్, నెహ్రూ రోడ్డు, లక్ష్మీ డీలక్స్ రోడ్డు, మెయిన్ రోడ్డు మీదుగా బోసురోడ్డులోని శ్రీకన్యకాపరమేశ్వరి దేవస్థానం వరకు రథయాత్ర జరుగుతుందని చెప్పారు. దేవాలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రవచనం, 108 పదార్థాలతో భోగ నివేదన, మహా హారతి ఉంటాయని తెలిపారు. అన్నప్రసాద వితరణ ఉంటుందని వివరించారు. ఆలయ కమిటీ సభ్యులు అప్పారావు, శ్రీనివాసరెడ్డి, ప్రసాద్, గోపాలకృష్ణ, కార్తీక్ తదితరులున్నారు.

## దుర్గమ్మకు ఆషాఢ సారె

మంగళగిరి టౌన్: పట్టణంలోని బైపాస్‌రోడ్‌లో ఉన్న పెట్రోల్ బంక్ సమీపంలోని శ్రీ కనకదుర్గమ్మ వారి ఆలయంలో ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఆంజనేయ కాలనీ భక్తబృందం శుక్రవారం సారె సమర్పించింది. కాలనీలోని ప్రధాన సెంటర్ నుంచి మహిళలు సారెతో ఊరేగింపుగా వచ్చారు. మేళతాళాలు, కనక తప్పెట్ల మధ్య ఊరేగింపు భక్తి శ్రద్ధలతో సాగింది. ఆయా వీధుల్లోని వారు సారెకు భక్తి శ్రద్ధలతో నీరు వారబోశారు. అనంతరం ఊరేగింపు ఆలయం వరకు చేరుకుంది. అమ్మవారికి సారె సమర్పించి ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో భక్తబృందం ప్రతినిధులు మల్లేశ్వరి, అంజలి, సత్యవతి, లేఖ, సుజాత, వాణి పాల్గొన్నారు.

### రేపల్లె సబ్ జైలులో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించిన మన్నెం వెంకటేశ్వరరావు మృతి

రేపల్లె: రేపల్లె సబ్ జైలులో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించిన మన్నెం వెంకటేశ్వరరావు(59) మృతి చెందారు. సబ్‌జైల్ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న వెంకటేశ్వరరావు శుక్రవారం తెల్లవారుజామున గుండెపోటుతో ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. ఉదయం వరకు నిద్రలేవక పోవడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇటీవల రిమాండ్ ఖైదీ బీముడు అజిత్ కుమార్ పరారీ ఘటన నేపథ్యంలో వెంకటేశ్వరరావును అధికారులు సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. సహోద్యోగులు, సిబ్బంది ఆయన మృతిపట్ల సంతాపం వ్యక్తం చేశారు. మృతుడు వెంకటేశ్వరరావుకు భార్య పార్వతి, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

# చీరాలలో టీడీపీ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం

## పార్టీ బలోపేతం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి: ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య



**చీరాల, పెన్ పవర్, జూలై 17 :** చీరాల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య కార్యకర్తలకు పార్టీ బలోపేతం, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజల్లో పార్టీకి మరింత ఆదరణ పెంచే అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికి చేరవేయాలని కార్యకర్తలకు సూచించారు. గత ప్రభుత్వంతో పోలిస్తే ప్రజలకు మెరుగైన సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, వాటిని ప్రజలకు వివరించడం ప్రతి కార్యకర్త బాధ్యత అని అన్నారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడానికి ప్రతి బూత్, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జి రోజుకు కనీసం ఒక గంట సమయాన్ని పార్టీ అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయించాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్తే తెలుగుదేశం పార్టీ తిరుగులేని శక్తిగా నిలుస్తుందని ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య పేర్కొన్నారు. ఈ సమావేశంలో బాపట్ల జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సలగల రాజశేఖర్ బాబు, రాష్ట్ర యువ నాయకుడు మద్దులూరి గౌరీ అమర్నాథ్, ఏఎంసీ చైర్మన్ కౌతరపు జనార్ధన్, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు లలిత, మాజీ మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పొత్తూరి సుబ్బయ్య, పట్టణ అధ్యక్షుడు దిగుబర్తి సురేష్, పందిళ్లపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు పల్లప్రోలు శ్రీనివాసరావు, నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు పోలకం శేఖర్, నియోజకవర్గ యువజన అధ్యక్షుడు బాలకృష్ణ, శ్రీనివాస్ రెడ్డి, వివిధ హోదాల్లో ఉన్న పార్టీ నాయకులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఖరీఫ్‌కు విత్తనాల కొరత లేదు : జిల్లా వ్యవసాయ శాఖ



**బాపట్ల, పెన్ పవర్, జూలై 16 :** ఖరీఫ్ సాగు వేగంగా కొనసాగుతున్న నేపథ్యంలో బాపట్ల జిల్లాలో విత్తనాల కొరత లేదని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి లక్ష్మి తెలిపారు. ప్రభుత్వం ముందస్తుగా అవసరమైన విత్తనాలను జిల్లాకు సరఫరా చేయడంతో రైతులకు సకాలంలో పంపిణీ జరుగుతోందని చెప్పారు. విత్తనాల పంపిణీలో ఎలాంటి ఆటంకాలు లేవని, విత్తనాలు అందక పంటలు వేయలేదంటూ ఇప్పటివరకు ఒక్క ఫిర్యాదు కూడా అందలేదని స్పష్టం చేశారు. జిల్లాలో రైతుల అవసరాలకు అనుగుణంగా వివిధ పంటలకు సంబంధించిన విత్తనాలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. జిల్లాకు చేరిన విత్తనాల్లో ఇప్పటికే సగానికి పైగా రైతులకు పంపిణీ పూర్తయిందని వెల్లడించారు. ముఖ్యంగా వరి, జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాల పంపిణీ అధిక శాతంలో పూర్తైనట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ గోదాముల్లో కూడా తగినంత నిల్వలు ఉన్నాయని, రైతుల అవసరాలను బట్టి వాటిని పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. అవసరమైతే అదనపు విత్తనాలను కూడా ప్రభుత్వం నుంచి తెప్పించే అవకాశం ఉందన్నారు. జిల్లాలో సుమారు 69 శాతం మంది రైతులు ప్రైవేట్ సంస్థల విత్తనాలను కొనుగోలు చేస్తున్నప్పటికీ, ప్రభుత్వం అందిస్తున్న ధ్రువీకరించిన విత్తనాలకు కూడా మంచి ఆదరణ ఉందని అధికారులు తెలిపారు. రైతులు నాణ్యమైన, ధ్రువీకరించిన విత్తనాలనే వినియోగించాలని సూచించారు. వర్షాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంటల ఎంపిక చేసుకోవాలని, విత్తనాల అవసరం ఉంటే సమీప రైతు సేవా కేంద్రాలు లేదా వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి లక్ష్మి రైతులకు సూచించారు. ఖరీఫ్ సాగు విజయవంతం కావడానికి ప్రభుత్వం అవసరమైన అన్ని విత్తనాలను అందుబాటులో ఉంచిందని, రైతులకు అన్ని విధాలా సహకారం అందిస్తామని ఆమె పేర్కొన్నారు.

# సమస్యలను త్వరితగతిన పరిష్కరించి తగు చర్యలు తీసుకోవాలి : ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు.



**వేమూరు(భట్టిప్రోలు)పెన్ పవర్: 17:** ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించి తగు చర్యలు తీసుకునేందుకు చర్యలు చేపట్టాలని వేమూరు శాసనసభ్యులు, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. శుక్రవారం జరిగిన పిజిఆర్ఎస్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రజల వద్దకు సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రతినిధులు వచ్చి పరిష్కరించే దిశగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక, మీకోసం కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వేదిక వద్ద ప్రజల సమస్యల అర్జీలను స్వయంగా స్వీకరించి పరిష్కారానికి చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుండి 60 వినతులు, ఫిర్యాదులు, అభ్యర్థనలను ఒక్కొక్కటిగా స్వీకరించి పరిశీలించారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, తాగునీటి సరఫరా, రహదారులు, విద్యుత్,సంక్షేమ పథకాలు,వైద్య సేవలు,వ్యవసాయం తదితర అంశాలకు సంబంధించిన సమస్యలపై సంబంధిత శాఖల అధికారులతో అక్కడికక్కడే సమీక్ష నిర్వహించి, అర్హమైన ప్రతి సమస్యకు ప్రాధాన్యతనిస్తూ తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందబాబు మాట్లాడుతూ,ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడం కూటమి ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు.ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా, ప్రభుత్వ సేవలు నేరుగా ప్రజలకు చేరే విధంగా "మీకోసం" కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు.ప్రతి వినతిని బాధ్యతాయుతంగా పరిశీలించి,అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా కట్టుబడి పనిచేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో వేమూరు మండల కూటమి ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు,వివిధ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది : ఎమ్మెల్యే,గళ్ళా మాధవి



**గుంటూరు, పెన్ పవర్, జులై, 17 :** ఆంధ్రప్రదేశ్‌లో మహిళల ఆర్థిక సాధికారతకు పునాది వేసిన డ్వాక్రా సంఘాలు ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు మానస పుత్రికలని, అలాంటి వ్యవస్థలో అవినీతి, అక్రమాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ తావులేదని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు గళ్ళా మాధవి స్పష్టం చేశారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మెప్మా అధికారులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, ఆర్పీలు (రిసోర్స్ పర్సన్స్)తో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. డ్వాక్రా సంఘాల కార్యకలాపాలు, మహిళలకు అందుతున్న రుణాలు, వాయిదాల చెల్లింపులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై ఎమ్మెల్యే సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ.రాష్ట్రంలో మహిళలను స్వయం సమృద్ధి దిశగా నడిపించేందుకు చంద్రబాబు నాయుడు డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేశారని, లక్షలాది మంది మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడంలో ఈ వ్యవస్థ కీలక పాత్ర పోషించిందని తెలిపారు. అలాంటి గొప్ప వ్యవస్థపై ఎలాంటి మచ్చ పడకుండా అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఇటీవల కొందరు డ్వాక్రా మహిళలు తన కార్యాలయానికి వచ్చి రుణాల మంజూరు, వాయిదాల చెల్లింపుల విషయంలో కొంతమంది కింది స్థాయి సిబ్బంది, మధ్యవర్తులు అక్రమాలకు పాల్పడుతున్నారంటూ ఫిర్యాదులు చేశారని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. రుణాలు ఇప్పిస్తామంటూ కమిషన్లు వసూలు చేయడం, మహిళల అజ్ఞానాన్ని ఆసరాగా చేసుకుని అన్యాయాలకు పాల్పడటం వంటి చర్యలు ఏమాత్రం సహించబోమని హెచ్చరించారు. డ్వాక్రా మహిళలకు అందే ప్రతి రూపాయి వారి అభివృద్ధికే వినియోగించబడాలని, రుణాల మంజూరు ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని అధికారులకు ఆదేశించారు. గతంలో కొనసాగిన కమిషన్ సంస్కృతికి పూర్తిగా స్వస్తి పలకాలని, మహిళలపై ఎలాంటి ఆర్థిక భారం మోపకుండా సేవా దృక్పథంతో పనిచేయాలని సూచించారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో "అవినీతి" అనే మాట వినిపించకుండా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. డ్వాక్రా సంఘాలకు సంబంధించిన ఏ సమస్య అయినా, ఎక్కడైనా అన్యాయం జరిగినా మహిళలు భయపడకుండా నేరుగా తనను సంప్రదించాలని పిలుపునిచ్చారు. మహిళల హక్కులను కాపాడటంలో రాజీ ఉండదని, తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు. మెప్మా వ్యవస్థపై మహిళలకు పూర్తి విశ్వాసం కలిగేలా అధికారులు పనిచేయాలని, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా డ్వాక్రా సంఘాలను మరింత బలోపేతం చేయాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి సూచించారు. ఈ సమావేశంలో మెప్మా అధికారులు, బ్యాంకు ప్రతినిధులు, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

# విశ్వశాంతి విద్యార్థినులకు షైనింగ్ స్టార్ అవార్డు

**భట్టిప్రోలు, పెన్ పవర్ జులై, 17:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యారంగంలో ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న షైనింగ్ స్టార్ అవార్డుకు విశ్వశాంతి ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇరువురు ఎంపికయ్యారని విశ్వశాంతి పాఠశాలల పాలకవర్గ అధ్యక్షులు ఎం.పి వెంకట్రావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూం2026 మార్చిలో జరిగిన ఎస్.ఎస్.సి పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు ఆ ఇరువురు సాధించారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు ప్రకటించిన షైనింగ్ స్టార్ అవార్డ్స్ కు ఎంపికైన పాఠశాల విద్యార్థిని వై. కుసుమ (590)మార్కులు, మరో విద్యార్థి బి సాయి గణేష్ నాయక్ (568) మార్కులు సాధించారని వెంకట్రావు తెలిపారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయా విద్యార్థి, విద్యార్థినులను ఆయన అభినందించారు. ఈ అవార్డు సొంతం చేసుకునేందుకు సహకరించిన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బందికి కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ ఎం.పీ.వెంకట్రావు ధన్యవాదములు తెలిపారు.





# ఘనంగా అంతర్జాతీయ న్యాయ దినోత్సవ వేడుకలు



**మచిలీపట్నం, పెన్ పవర్,జూలై 17 :** అంతర్జాతీయ న్యాయ దినోత్సవ వేడుకలు మచిలీపట్నం భార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు తుంగల హరిబాబు మాట్లాడుతూ న్యాయ వ్యవస్థ ఉన్నతి కోసం సత్వర కేసులు పరిష్కారం కోసం న్యాయవాదులందరూ కలిసికట్టుగా కృషి చేస్తున్నామని తెలియజేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం న్యాయ వ్యవస్థ కట్టుబడి ఉందని, 125 సంవత్సరాల చరిత్ర కలిగిన మచిలీపట్నం బార్ అసోసియేషన్కు న్యాయ వ్యవస్థలోనే ప్రత్యేక గుర్తింపు ఉందని ఎందరో న్యాయమూర్తులను అందించిన భార్ అసోసియేషన్ మచిలీపట్నం బార్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సర్వ లలిత కుమారి లైబ్రరీ కార్యదర్శి పి. సూర్య ప్రకాష్ సీనియర్ న్యాయవాదులు సోడిశెట్టి బాలాజీ రావు కొట్టే రఘురామ్,మాజీ ఏపీపీ అడపా మురళి, మాజీ జిల్లా ప్రభుత్వం న్యాయవాది ఉప్పలపు సుబ్రమణ్యం, రెడ్రౌతు రమణారావు, వంక లావణ్య, శరణ్య పలువురు అడ్వకేట్స్ పాలుగున్నారు. అంతర్జాతీయ న్యాయ దినోత్సవం పురస్కరించుకుని మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ తన జూనియర్స్ తో కలిసి బార్ అసోసియేషన్ కు లైబ్రరీ భద్రపరుచుకుని బీరువాను మరియు పుస్తకాలను క్రిమినల్ మేజర్ యాక్ట్ పుస్తకాలను బార్ అసోసియేషన్ కి లంకిశెట్టి సాయి ఫణి సంతోష్ ద్వారా అందజేశారు. లంకి శెట్టి సాయి ఫణి సంతోష్ ఆధ్వర్యంలో న్యాయవాదులకు న్యాయశాఖ సిబ్బందికి స్వీట్లు పంపిణీ చేశారు

# భార్యాభర్తలను కలిపిన శక్తి టీం



**చీరాల, పెన్ పవర్, జూలై 17 :** బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, చీరాల సబ్‌డివిజన్ డీఎస్పీ మొయిన్ ఆధ్వర్యంలో పనిచేస్తున్న శక్తి టీం సభ్యులు తప్పిపోయిన మహిళను గుర్తించి ఆమెను భర్తకు అప్పగించి దంపతులను తిరిగి కలిపారు. వివరాల్లోకి వెళితే, విజయవాడకు చెందిన మేరీ, ఆమె భర్త ఏసోబు మధ్య కుటుంబ కలహాలు చోటుచేసుకోవడంతో మేరీ రెండు రోజుల క్రితం భర్తకు చెప్పకుండా రైలులో చీరాలకు వచ్చింది. భార్య కోసం వెతుకుతూ చీరాలకు వచ్చిన ఏసోబు, చీరాల రైల్వే స్టేషన్‌లో విధుల్లో ఉన్న శక్తి టీం సభ్యులకు జరిగిన విషయాన్ని వివరించాడు. దీనిపై స్పందించిన శక్తి టీం సభ్యులు చీరాల వన్‌టౌన్ సీఐ సోమశేఖర్‌కు సమాచారం అందించి, ఉమెన్ ఏఎస్సై శివకుమారి, కానిస్టేబుళ్లు సుబ్బారావు, సునీతతో కలిసి విస్తృతంగా గాలింపు చేపట్టారు. ఆర్టీసీ బస్టాండ్, ఫ్లైఓవర్ పరిసర ప్రాంతాల్లో వెతికిన అనంతరం రైల్వే పాడుబడిన క్వాటర్స్ సమీపంలోని ఓ చెట్టు కింద నిద్రిస్తున్న మేరీని గుర్తించారు. అనంతరం ఆమెను సురక్షితంగా తీసుకొచ్చి భర్త ఏసోబుకు అప్పగించారు. అనంతరం భార్యాభర్తలిద్దరినీ విజయవాడ వెళ్లే రైలులో ఎక్కించి పంపించారు. ఈ సందర్భంగా మేరీ, ఏసోబు శక్తి టీం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. దంపతులను సురక్షితంగా కలిపిన శక్తి టీం సభ్యులను చీరాల వన్‌టౌన్ సీఐ సోమశేఖర్ అభినందించారు.

# ఈపురుపాలెంలో నూతన నేతాజీ బస్ షెల్టర్ ప్రారంభం



**చీరాల, పెన్ పవర్, జూలై 17 :** చీరాల మండలం ఈపురుపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన నేతాజీ బస్ షెల్టర్ను చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా బస్ షెల్టర్ నిర్మాణానికి సహకరించిన నిర్మాణ దాతలను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. దివంగత చేగుడి శ్రీరాములు, విజయమ్మ గార్ల జ్ఞాపకార్థంగా వారి కుమారులు ఈ బస్ షెల్టర్‌ను నిర్మించడం అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామ ప్రజలకు ప్రయాణ సౌకర్యం మెరుగుపడేలా ఈ బస్ షెల్టర్ ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కౌతరపు జనార్ధన్, గుద్దంటి చంద్రమౌళి, శ్రీకాళహస్తి బోర్డు సభ్యురాలు కొమ్మనబోయిన రజిని, గంజి పురుషోత్తం, దోగుపర్తి వెంకట సురేష్, కర్నేటి శీను, అవ్వరు సాంబయ్యతో పాటు కూటమి నాయకులు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఘనంగా లక్ష్మీ అమ్మవారి కుంకుమార్చన.



**భట్టిప్రోలు,పెన్ పవర్ (జులై 17) :** తిరుమల తిరుపతి దేవస్థానము,హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో చావలి వాలేశ్వర స్వామి దేవాలయం(శివాలయం) లో మంగళవారం నుండి శుక్రవారం వరకు జరిగిన ధార్మిక కార్యక్రమాలు నేటితో తో ముగిశాయి. షుమారు 250 మంది మహిళలతో ఘనంగా లక్ష్మీ అమ్మవారి కుంకుమార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న టిటిడి ఉమ్మడి గుంటూరు జిల్లా శాఖ ప్రోగ్రాం ఆఫీసర్ ఇ అమ్మడు మాట్లాడుతూ కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి పూజించి సేవించటం వల్ల సకల శుభాలు కలుగుతాయని లక్ష్మీ అమ్మవారిని పూజించటం వల్ల సకల ఐశ్వర్య భోగభాగ్యాలు కలిగి శుభాలు కలుగుతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు బూర్లె అరుణకుమారి టీటీడీ ధార్మిక సేవా సభ్యులు పొన్నపల్లి సత్యనారాయణ, చవ్వాకుల శాంతకుమారి, గ్రామ పెద్దలు పట్టెల లక్ష్మీనారాయణ,సోమరౌతు లక్ష్మీధర్, వెంకటేశ్వరరావు, వెంకయ్య, విష్ణుమొలకల శ్రీరామకోటేశ్వరరావు, గుడిపల్లి వెంకటేశ్వర్లు,గోపాలం సాంబశివరావు, రామారావు, గాజుల సాయిరాం, తాడికొండ రఘురామయ్య, అర్చకులు చావలి మణికంఠశర్మ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# అధికారుల పని తీరు మారదు... అక్రమ తవ్వకాలు ఆగవు..!



**పెడన, పెన్ పవర్, జులై 17 :** పెడన మండలం చెన్నూరు గ్రామంలో అక్రమ చేపల చెరువుల తవ్వకాల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఆక్వా జోన్ పరిధిలో ఉన్న కేవలం 9.30 సెంట్ల భూమిని ఆధారంగా చేసుకుని, దానికి ఆనుకుని ఉన్న సుమారు 22 ఎకరాల వ్యవసాయ భూమిని చేపల చెరువులుగా మార్చేశారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. వ్యవసాయానికి అనువైన భూమిని నిబంధనలకు విరుద్ధంగా చెరువులుగా మార్చినా, సంబంధిత శాఖల అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు, విమర్శలకు తావిస్తోంది. గ్రామస్థుల కథనం ప్రకారం, ఈ వ్యవహారాన్ని రెవెన్యూ, మత్స్యశాఖ, తదితర సంబంధిత అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని చెబుతున్నారు. ఫిర్యాదులు అందినా క్షేత్రస్థాయిలో పరిశీలన జరగకపోవడం, అక్రమ తవ్వకాలను అడ్డుకునే చర్యలు లేకపోవడం వల్ల సంబంధిత అధికారుల పనితీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వ్యవసాయ భూములను చెరువులుగా మార్చడం వల్ల చుట్టుపక్కల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూగర్భ జలాలపై ప్రభావం పడటంతో పాటు సమీప పొలాల సాగు కూడా దెబ్బతింటోందని పేర్కొంటున్నారు. భవిష్యత్తులో ఈ ప్రభావం మరింత తీవ్రంగా ఉండే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో జరుగుతున్న తవ్వకాలపై సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. అక్రమంగా మార్పులు చేసిన భూములపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఫిర్యాదులు వచ్చినప్పటికీ స్పందన లేకపోవడం వెనుక కారణాలపై కూడా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు. ఇటీవల అక్రమ మట్టి తవ్వకాలు, వ్యవసాయ భూములను ఆక్వా చెరువులుగా మార్చే ఘటనలు జిల్లాలో పెరుగుతున్న నేపథ్యంలో చెన్నూరు ఘటన కూడా అదే కోవలోకి చేరిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజల నుంచి వరుసగా ఫిర్యాదులు వస్తున్నా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ బలహీనంగా ఉండటం వల్ల అక్రమాలకు అడ్డుకట్ట పడడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై ఆర్డీవో కె. సాంబశివరావు ను పెన్ పవర్ వివరణ కోరగా కిందిస్థాయి అధికారులకు సిబ్బందికి పనులు నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేస్తామని వివరణ ఇచ్చారు.

# ప్రభుత్వ మహిళా కళాశాల అభివృద్ధి నా బాధ్యత : గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు, పెన్ పవర్, జులై, 17 :** సుమారు 500 మంది విద్యార్థినులు విద్యనభ్యసించే కళాశాల... కనీసం మరుగుదొడ్ల వసతి కూడా లేని దీనస్థితి. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో విద్యార్థినుల ఆత్మగౌరవాన్ని పట్టించుకోని దైన్యం. ఇలాంటి పరిస్థితిని స్వయంగా చూసిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ చలించిపోయారు. అధికారంలోకి వచ్చిన వెంటనే గుంటూరు ప్రభుత్వ మహిళా కళాశాల సందర్శించిన ఎమ్మెల్యే నసీర్ కనీసం మౌలిక వత్తులు కల్పిస్తామని ఆనాడే హామీ ఇచ్చారు. ఈ మేరకు ఇప్పటికే రూ.67 లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేయించారు. ప్రభుత్వ మహిళా కళాశాలలో క్రీడా మైదానం అభివృద్ధి, డ్రైనేజీల నిర్మాణానికి శుక్రవారం స్థానిక తూర్పు కార్యాలయంలో కళాశాల ప్రతినిధులకు ఎమ్మెల్యే నసీర్ రూ. 31 లక్షల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి శ్రీ నారా లోకేష్ స్ఫూర్తితో గుంటూరు తూర్పు నియోజకవర్గంలో విద్యాలయాలను మోడల్ గా తీర్చిదిద్దేందుకు నా వంతు కృషి చేస్తున్నానని తెలిపారు. వర్షాకాలంలో కళాశాల మైదానంలో నీరు నిల్వ ఉండటంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ క్రమంలో రూ.31 లక్షలతో క్రీడా మైదానం అభివృద్ధితోపాటు డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణానికి చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతం చేసేందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారి సంకల్పంతో ప్రతి విద్యాలయాన్నీ తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. విద్యాలయాల అభివృద్ధికి ఏ అవసరం వచ్చినా తాను ముందుంటానని స్పష్టం చేశారు. కళాశాల అభివృద్ధికి సహకరించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ , కలెక్టర్ సాయి కాంత్ వర్మకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# నదుల అనుసంధానాన్ని పట్టిసీమ ద్వారా సాకారం చేసిన సీఎం చంద్రబాబు : దేవినేని ఉమా



విజయవాడ, జులై 17: డాక్టర్ కేఎల్ రావు కలగన్న గంగా - కావేరి నదుల అనుసంధానాన్ని స్ఫూర్తిగా తీసుకుని సీఎం చంద్రబాబు నాయుడు గోదావరి - కృష్ణ నదుల అనుసంధానాన్ని పట్టిసీమ ద్వారా సాకారం చేశారని మాజీ మంత్రి దేవినేని ఉమా వెల్లడించారు. శుక్రవారం విజయవాడలో ఆయన మాట్లాడుతూ.. గతంలో వైఎస్ జగన్ పట్టిసీమను "వట్టిసీమ" అని విమర్శించారని గుర్తు చేశారు. కానీ ఆయన అధికారంలోకి వచ్చిన తర్వాత అదే పంపుల ద్వారా నీటిని ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందని వివరించారు. పట్టిసీమ నిర్మాణం సమయంలో జగన్ మమ్మల్ని అవమానించారని తెలిపారు. జగన్ పాలనలో అదే పట్టిసీమ దిక్కు అయ్యిందని వ్యంగ్యంగా అన్నారు. అమరావతి నిర్మాణం, పట్టిసీమ విషయంలో అడ్డంకులు సృష్టించడం వల్ల రాష్ట్రాభివృద్ధికి ఆటంకం కలిగిందని దేవినేని ఉమా ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను, కులాలను రెచ్చగొట్టారు.. మా దిష్టి బొమ్మలను దగ్ధం చేశారని అన్నారు. సీఎం చంద్రబాబు అకుంఠిత దీక్షతో మార్చి 2025లో ప్రారంభించి.. సెప్టెంబర్‌లోనే తొలి విడతగా కొంత నీటిని డెల్టాకు మళ్లించారని చెప్పారు. ఆ తర్వాత జగన్ సొంత నియోజకవర్గం పులివెందులకు నీరు అందించి సీఎం చంద్రబాబు చరిత్ర సృష్టించారని పేర్కొన్నారు. రాయలసీమ రతనాల సీమగా మార్చేందుకు అంకురార్పణ చేయడం ద్వారానే పరిశ్రమలు కూడా ఆ ప్రాంతానికి వచ్చాయని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో కూడా పట్టిసీమ ద్వారానే డెల్టాకు నీరు అందించడం దేవుడు రాసిన స్క్రిప్టు అని అభివర్ణించారు. పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా గోదావరి నీరు అందడం వల్ల చౌడు భూములు కూడా సారవంతంగా మారాయని దేవినేని ఉమా తెలిపారు. దీని వల్ల ఎకరాకు దిగుబడి 50 నుంచి 60 బస్తాలకు పెరిగిందని చెప్పారు. సాగు నీరు సమృద్ధిగా అందడం వల్ల ఎరువుల ఖర్చు తగ్గి, రైతుల ఆదాయం పెరిగిందని వివరించారు. కరువు సమయాల్లో కూడా నీటిని జాగ్రత్తగా మేనేజ్ చేస్తూ చెరువులు నింపడం, నారుమళ్లను కాపాడుకుంటున్నారని పేర్కొన్నారు. ఒకప్పుడు తక్కువ వర్షపాతంతో ఇబ్బంది పడిన రాయలసీమ.. నేడు హార్టికల్చర్ రంగంలో అద్భుతాలు చేస్తోందని వివరించారు. ఉరవకొండ వంటి ప్రాంతాల్లో రైతులు అరటి, చీని (బత్తాయి), కూరగాయలు, పూల సాగు ద్వారా కోటీశ్వరులుగా మారుతున్నారని మాజీ మంత్రి దేవినేని ఉమా సంతోషం వ్యక్తం చేశారు.

# ఏపీలో ఎల్‌నినో ప్రభావంపై సీఎస్ సమీక్ష

## అధికారులకు కీలక ఆదేశాలు



అమరావతి, జులై 17: రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ సమీక్ష నిర్వహించారు. ఈరోజు(శుక్రవారం) సచివాలయంలో జరిగిన సమీక్షలో పలు శాఖల అధికారులకు సీఎస్ కీలక ఆదేశాలు జారీ చేశారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖలూ అప్రమత్తంగా పనిచేసి ప్రాణ, ఆస్తి, పంటల నష్టాన్ని పూర్తిగా నివారించాలన్నారు. హైరిస్క్ రైతు సేవా కేంద్రాలు, మండలాలపై ప్రత్యేక దృష్టి సారించి పరిస్థితులను ప్రతిరోజూ పర్యవేక్షించాలని సూచించారు. రైతులకు నిరంతర సాంకేతిక సలహాలు అందిస్తూ, ప్రత్యామ్నాయ పంటల సాగు, తక్కువ కాలపరిమితి పంటలు, డ్రై సోయింగ్‌ను విస్తృతంగా ప్రోత్సహించాలన్నారు. ప్రత్యామ్నాయ విత్తనాల నిల్వలు ముందుగానే సిద్ధం చేసి, అవసరమైన ప్రాంతాలకు వెంటనే అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. తేమలేమితో ఆహారానికి పనికిరాని పంటలను పచ్చిమేతగా వినియోగించాలని... పంట అవశేషాల దహనాన్ని పూర్తిగా నిరోధించి పశుగ్రాసంగా ఉపయోగించాలని సీఎస్ సూచించారు. మేత పంటలకు రక్షిత సాగునీరు కల్పించి, పశుగ్రాస కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. మిగులు జిల్లాల నుంచి కొరత జిల్లాలకు పశుగ్రాస రవాణా వ్యవస్థను సమర్థంగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రతి మండలంలో కనీసం ఒక పశు శిబిరం ఏర్పాటు చేసి.. పశువులకు తాగునీరు, పశుగ్రాసం, వైద్య సేవలు నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. పశుగ్రాస బ్యాంకులు, మొబైల్ వెటర్నరీ సేవలు, జిల్లా స్థాయి అత్యవసర కార్యాచరణ ప్రణాళికలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని తెలిపారు. అన్ని శాఖలూ సమన్వయంతో పనిచేసి క్షేత్రస్థాయిలో చర్యల అమలుపై నిరంతరం సమీక్ష నిర్వహిస్తూ.. రైతులు, పశుపోషకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సీఎస్ జి.సాయిప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు.

# ప్రభుత్వ వైద్యాన్ని ప్రజల తొలి ఎంపికగా తీర్చిదిద్దడమే లక్ష్యం : మంత్రి సత్యకుమార్




విజయవాడ, జులై 15: ఏపీ ఆయుష్ విభాగంలో రూ.350 కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులు సిద్ధంగా ఉన్నాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఈరోజు(బుధవారం) విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన 'ఔషధ మొక్కలు ఆరోగ్యానికి అసలైన ఆధారం' వన్డే వర్క్ షాప్‌లో మంత్రి పాల్గొని ప్రసంగించారు. ఆయుష్ మౌలిక సదుపాయాల విస్తరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. నాలుగు కొత్త ఆయుష్ మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేశామని.. ధర్మవరం, పిఠాపురంలో ఆయుర్వేద కాలేజీలు ఉన్నాయని వెల్లడించారు. ఒక్కో కాలేజీకి ప్రభుత్వం రూ.70 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. ఆరు ప్రాంతాల్లో ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆస్పత్రులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. తిరుపతి, తెనాలి, నందిగామ సహా ఆరు ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆస్పత్రులకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని.. ఒక్కో ఆస్పత్రికి రూ.20 కోట్ల నిధులు కేటాయిస్తున్నామని మంత్రి చెప్పారు. 1,500లకు పైగా ఆయుష్ డిస్పెన్సరీలను ఆధునీకరించామన్నారు. ప్రివెంటివ్, వెల్‌నెస్ హెల్త్‌కేర్‌పై ప్రభుత్వ దృష్టి సారించిందన్నారు.'సంజీవని' డిజిటల్ హెల్త్ ప్లాట్‌ఫామ్ అమలు చేస్తున్నామని తెలిపారు. వచ్చే నెలలో కేంద్ర ఆయుష్ మంత్రి చేతుల మీదుగా కొత్త సదుపాయాల ప్రారంభానికి ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. అశ్వగంధ, మునగ, ఉసిరి సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహాన్ని అందిస్తోందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఓపీ సేవలు 20 శాతానికి పెరిగాయని, గుంటూరు జీజీహెచ్‌లో 255 ఓపెన్ హార్ట్ సర్జరీలు జరిగాయని మంత్రి వెల్లడించారు. 2026-27కు అదనంగా 325 ఎంబీబీఎస్ సీట్లు ఇవ్వనున్నామన్నారు. ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో విశ్వాసం పెరిగిందన్నారు. ప్రభుత్వ వైద్యాన్ని ప్రజల తొలి ఎంపికగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సత్య కుమార్ యాదవ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంతెన సత్యనారాయణ రాజు, ఆరోమాటిక్ ప్లాంట్స్ సీఈవో చంద్రశేఖర్, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# ఏపీలో మళ్లీ పెరుగుతున్న కరోనా కేసులు.. నలుగురు మృతి

అమరావతి : ఏపీలో మరోసారి కరోనా కేసులు నమోదవుతుండటంతో వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. రాష్ట్ర ఆరోగ్య శాఖ అధికారుల వివరాల ప్రకారం.. జూన్ 26 నుండి జులై 16 మధ్య కడపలో 8, గుంటూరులో 2, విశాఖపట్నంలో 1, కాకినాడలో 1 కేసు నమోదయ్యాయి. అలాగే దేశవ్యాప్తంగా ఈ నెల 339 కేసులు నమోదవ్వగా అత్యధికంగా కేరళలో 115 కేసులు నమోదు అయ్యాయి. కర్ణాటకలో 64, మహారాష్ట్రలో 43, తమిళనాడులో 39, అండమాన్, నికోబార్‌లో 8, ఢిల్లీలో 18, రాజస్థాన్‌లో 12 కోవిడ్ కేసులు నమోదైనట్లు ఆరోగ్య శాఖ వెల్లడించారు. ఈ నేపథ్యంలో ప్రజల అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

# అమరావతిలో రివర్ ఫ్రంట్ టూరిజంపై ప్రభుత్వం ఫోకస్



అమరావతి, జులై 17: ఏపీ రాజధాని అమరావతిలో రివర్ ఫ్రంట్ టూరిజం అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించింది. అమరావతిలో చేపట్టే టూరిజం ప్రాజెక్టులపై అమరావతి డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏడీసీఎల్) అధికారులతో మంత్రి నారాయణ ఈరోజు(శుక్రవారం) సమీక్ష నిర్వహించారు. అమ్యూజ్‌మెంట్ పార్క్, ఎకో టూరిజం పార్కులను పీపీపీ విధానంలో ఏడీసీఎల్ అభివృద్ధి చేయనుంది. ఈ నేపథ్యంలో అమరావతిలో రోడ్లు, భవనాల నిర్మాణం పూర్తయ్యేసరికి టూరిజం ప్రాజెక్టులు పూర్తి చేయాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు సూచనలను పరిగణనలోకి తీసుకుని పర్యాటకులను ఆకర్షించేలా ప్రాజెక్టులు వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. ఇప్పటికే టూరిజం ప్రాజెక్టుల కోసం భూములు కేటాయించిన మిగిలిన సంస్థలు కూడా త్వరగా పనులు ప్రారంభించేలా చూడాలని మంత్రి నారాయణ సూచించారు. ఈ సమీక్షకు అమరావతి డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ లక్ష్మీ పార్థసారథి, అధికారులు హాజరయ్యారు.

# స్థానిక ఎన్నికల్లో కొత్త వ్యూహం

## మంత్రి నాదెండ్ల మనోహర్ కీలక వ్యాఖ్యలు.

గుంటూరు జిల్లా తెనాలిలో స్థానిక సంస్థల ఎన్నికలపై ఆంధ్రప్రదేశ్ మంత్రి నాదెండ్ల మనోహర్ కీలక వ్యాఖ్యలు చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ తన బలాబలాలను అంచనా వేసుకుని పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రయోజనాలు, కూటమి బలోపేతమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కూటమి విజయమే ముఖ్యమని, అవసరమైతే ఒక అడుగు వెనక్కు తగ్గేందుకు కూడా జనసేన సిద్ధంగా ఉంటుందని మంత్రి మనోహర్ వెల్లడించారు. అదే సమయంలో పార్టీ కోసం కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు తగిన ప్రాధాన్యం కల్పిస్తామని, వారికి పోటీ చేసే అవకాశం కూడా ఇస్తామని హామీ ఇచ్చారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అమలైన సీట్ల పంపిణీ ఫార్ములానే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కొనసాగుతుందన్న ప్రచారాన్ని మంత్రి మనోహర్ ఖండించారు. అప్పటి రాజకీయ పరిస్థితులు, రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూటమి నిర్ణయం తీసుకున్నారని గుర్తుచేశారు. ప్రస్తుత స్థానిక సంస్థల ఎన్నికల పరిస్థితులు భిన్నంగా ఉన్నాయని, అందువల్ల గత ఎన్నికల ఫార్ములా యథాతథంగా అమలవుతుందని చెప్పడం సరైంది కాదని మంత్రి స్పష్టం చేశారు. స్థానిక పరిస్థితులు, పార్టీ బలం, రాష్ట్ర ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని తుది నిర్ణయాలు తీసుకుంటామని వెల్లడించారు. ఇక, జనసేనలో పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి తగిన అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమని మంత్రి మనోహర్ మరోసారి స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి భాగస్వామ్య పార్టీలతో సమన్వయం కొనసాగిస్తూ, విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతామని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు ..

# ప్రియుడు మోసం చేశాడని సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆత్మహత్య

## మృతదేహం మెడలో తాళి కట్టాలని ఆందోళన!



ఎనిమిదేళ్లుగా ప్రేమించిన యవకుడు మోసం చేయడంతో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని తట్టుకోలేకపోయింది. తనను కాదని వేరే అమ్మాయితో పెళ్లికి సిద్ధమవడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో బాధిత కుటుంబసభ్యులు ప్రియుడు ఇంటి ముందు ఆందోళనకు దిగారు. మృతురాలి మెడలో తాళికట్టి న్యాయం చేయాలని నిరసన చేపట్టారు. ఏపీలోని ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం పొందురులో ఈ ఘటన చోటుచేసుకుంది. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం చినకొండ్రుపాడు గ్రామానికి చెందిన అడ్డగళ్ల కీర్తి (24) ముంబైలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తోంది. ఆమెకు ఖతార్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న పొందూరుకు చెందిన పాపినేని సాయి అనే యువకుడితో 8 ఏళ్ల క్రితం పరిచయం ఏర్పడింది. అదికాస్త ప్రేమగా మారడంతో పెళ్లి కూడా చేసుకోవాలని అనుకున్నారు. అయితే వారం కిందట సాయికి అతని కుటుంబసభ్యులు వేరే అమ్మాయితో పెళ్లి నిశ్చయించారు. ఈ విషయం తెలిసిన కీర్తి ముంబై నుంచి నాలుగు రోజుల కిందట ఒంగోలు వచ్చి సాయి తల్లిదండ్రులను కలిసింది. సాయితో వివాహం చేయాలని కోరింది. అయితే అందుకు సాయి కుటుంబసభ్యులు నిరాకరించారు. అంతేకాకుండా బెదిరింపులకు దిగారు. దీంతో సాయిని మరిచిపోవాలని ఆమె తల్లిదండ్రులు నచ్చజెప్పారు. అనంతరం కీర్తి ముంబైకి వెళ్లిపోయింది. ప్రియుడు చేసిన మోసాన్ని తట్టుకోలేక ఈ నెల 14వ తేదీన ముంబైలో ఉరేసుకుంది. ఈ ఘటనపై ముంబై పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని కీర్తి కుటుంబసభ్యులకు గురువారం అప్పగించారు. కీర్తి సూసైడ్‌తో తీవ్ర ఆగ్రహానికి గురైన ఆమె కుటుంబసభ్యులు, బంధువులు పొందూరులోని సాయి ఇంటి వద్ద ఆందోళన చేపట్టారు. కీర్తి మృతదేహాన్ని ఇంటి వరండాలో ఉంచి తమకు న్యాయం చేయాలని నిరసన తెలిపారు. సాయి చేత మృతురాలి మెడలో తాళి కట్టించి, అంత్యక్రియలు నిర్వహించాలని పట్టుబట్టారు. ఆ సమయంలో సాయి ఇంట్లో ఎవరూ లేరు. విషయం తెలుసుకున్న టంగుటూరు పోలీసులు వచ్చి దీనిపై సాయి బంధువులు, కీర్తి బంధువులతో చర్చించారు. అనంతరం సాయి బంధువులు కలగజేసుకుని తమ సంప్రదాయం ప్రకారం మృతదేహానికి అంత్యక్రియలు పూర్తిచేశారు. కాగా, కీర్తి ఆత్మహత్య గురించి తెలుసుకుని సాయి ఖతార్‌కు వెళ్లిపోయాడని బాధిత కుటుంబం ఆరోపిస్తోంది.

# తక్కువ నాణ్యత పొగాకుకూ గిట్టుబాటు ధర

## టొబాకో బోర్డుకు మంత్రి అచ్చెన్న ఆదేశాలు



అమరావతి, జులై 17: ఎఫ్‌సీవీ పొగాకు కొనుగోళ్లపై వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఈరోజు(శుక్రవారం) టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పొగాకు కొనుగోళ్లను వేగవంతం చేసి రైతులకు గిట్టుబాటు ధర కల్పించే చర్యలపై సమావేశంలో చర్చించారు. 2026-27లో ఖీజఎ పొగాకు ఉత్పత్తిని సుమారు 81 మిలియన్ కిలోలకు పరిమితం చేస్తూ రైతులకు అవగాహన కల్పిస్తామని మంత్రి తెలిపారు. గత నాలుగు రోజులుగా కొనుగోళ్లు ఊపందుకున్నాయని... రోజుకు 8.5 లక్షల కిలోల పొగాకు కొనుగోలు జరుగుతోందన్నారు. ప్రస్తుతం గరిష్ఠ ధర రూ.250గా ఉందని.. ధర మరింత పెరిగేలా కంపెనీలపై ఒత్తిడి తీసుకురావాలని టొబాకో బోర్డుకు మంత్రి సూచించారు. కొనుగోళ్లు వేగవంతం కావడంతో రైతులకు మరింత మెరుగైన ధర లభించే అవకాశం ఉంటుందన్నారు. తక్కువ నాణ్యత గల పొగాకుకూ గిట్టుబాటు ధర లభించేలా కంపెనీలతో చర్చించాలని టొబాకో బోర్డు చైర్మన్, ఈడీకి మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి పాల్గొన్నారు.

# ఏపీలో కొత్త జోనల్ విధానానికి శ్రీకారం

## ఉద్యోగుల కేటాయింపులకు కొత్త రూల్స్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో కొత్త జోనల్ విధానం అమలుకు శ్రీకారం చుట్టింది. రాష్ట్రపతి ఉత్తర్వులు--2025కు అనుగుణంగా స్థానిక (లోకల్) క్యాడర్ల ఏర్పాటు, ఉద్యోగుల కేటాయింపు ప్రక్రియను చేపడుతూ సమగ్ర మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం మూడు అంచెల కమిటీలను ఏర్పాటు చేసింది.. జిల్లా, శాఖాధిపతి, సచివాలయ స్థాయిల్లో ప్రత్యేక కమిటీలు పనిచేయనున్నాయి. జిల్లా కమిటీకి పాత జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరించగా, కొత్త జిల్లాల కలెక్టర్లు కో-చైర్మన్లుగా బాధ్యతలు నిర్వర్తిస్తారు. ఉద్యోగుల సీనియారిటీ, వ్యక్తిగత ప్రాధాన్యతలు, ప్రభుత్వ నిబంధనలను పరిగణనలోకి తీసుకుని క్యాడర్ల కేటాయింపులు చేపట్టనున్నట్లు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

ప్రత్యేక వర్గాల ఉద్యోగులకు ప్రభుత్వం ప్రాధాన్యత కల్పించింది. 70 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్న ఉద్యోగులు, వితంతువులు, అలాగే క్యాన్సర్, గుండె శస్త్రచికిత్స, కిడ్నీ లేదా లివర్ మార్పిడి చేయించుకున్న ఉద్యోగులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వనుంది. దీంతో ఆరోగ్య, సామాజిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని మానవతా కోణంలో నిర్ణయాలు తీసుకోనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. షెడ్యూల్డ్ కులాలు (ాజ), షెడ్యూల్డ్ తెగలు (ాు)కు క్యాడర్లలో నిష్పత్తి ప్రకారం సమాన పంపిణీ ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ాజ గ్రూప్-1కు 1 శాతం, గ్రూప్-2కు 6.5 శాతం, గ్రూప్-3కు 7.5 శాతం, ాులకు 6 శాతం మేర కేటాయింపులు ఉండనున్నాయి.

**తప్పుడు సమాచారం ఇస్తే కఠిన చర్యలు..** ఉద్యోగుల నుంచి తప్పుడు సమాచారం అందితే కఠిన క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హెచ్చరించింది. అలాగే ఒకసారి ఉద్యోగి తన ఆప్షన్ నమోదు చేసిన తర్వాత దాన్ని మార్చుకునే అవకాశం ఉండదని స్పష్టం చేసింది. భార్యాభర్తలు వేర్వేరు ప్రాంతాల్లో పనిచేస్తున్న స్పౌస్ కేసుల కోసం ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేసింది. ఉద్యోగుల కేటాయింపులపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే, కేటాయింపు ఉత్తర్వులు వెలువడిన తేదీ నుంచి ఏడు రోజులలోపు సంబంధిత సచివాలయ కార్యదర్శికి అప్పీల్ చేసుకునే అవకాశం కల్పించింది. కొత్త జోనల్ విధానం ద్వారా ఉద్యోగుల కేటాయింపు ప్రక్రియ మరింత పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా కొనసాగుతుందని పేర్కొంది ఏపీ ప్రభుత్వం..

# ఉచిత పథకాలపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు సంచలన వ్యాఖ్యలు

ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఉచిత పథకాలపై మాట్లాడిన ఆయన, ప్రజలు కేవలం సంక్షేమ పథకాలపైనే ఆధారపడకుండా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. రాష్ట్రాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఇంకా ఆయన మాట్లాడుతూ.."నేను సాధారణంగా స్వేచ్ఛగా మాట్లాడే వ్యక్తిని. కానీ ఇప్పుడు రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిలో ఉన్నందున నా నోటికి ప్లాస్టర్ వేసినట్లుగా ఉంది. ఏదైనా పొరపాటున మాట్లాడితే 'స్పీకర్ హోదాలో ఉండి ఇలా మాట్లాడారు' అంటూ వివాదం సృష్టిస్తారు. అలా జరిగితే నాకు ఉన్న పదవి కూడా పోతుంది" అంటూ నవ్వుతూ వ్యాఖ్యానించారు. ప్రజల ఆలోచనా విధానంలో మార్పు రావాల్సిన అవసరం ఉందని అయ్యన్నపాత్రుడు అభిప్రాయపడ్డారు. కేరళ ప్రజలను ఉదాహరణగా ప్రస్తావిస్తూ, అక్కడ ప్రజలు అభివృద్ధిలో చురుకుగా పాల్గొంటారని, కానీ మన రాష్ట్రంలో మాత్రం ఉచిత పథకాలు ఏమి వస్తాయనే దానిపైనే ఎక్కువగా దృష్టి పెడుతున్నారని అన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ అంశంపై కూడా స్పీకర్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. కేరళలో ప్రజలు పెద్దఎత్తున మొక్కలు నాటుతారని, మన రాష్ట్రంలో కూడా ప్రతి ఒక్కరూ కనీసం ఒక చెట్టైనా నాటాలని పిలుపునిచ్చారు. అయితే ఇక్కడ మొక్కలు నాటడం కంటే చెట్లను నరికివేయడంపైనే ఎక్కువ దృష్టి కనిపిస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి వ్యక్తి ఒక మొక్క నాటితే రాష్ట్రం మొత్తం పచ్చదనంతో కళకళలాడుతుందని అన్నారు. రాజకీయాలపై కూడా అయ్యన్నపాత్రుడు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎప్పుడూ రాజకీయ విమర్శలు, ప్రతివిమర్శలే జరుగుతున్నాయని, అభివృద్ధి అంశాలపై చర్చలు తక్కువగా కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా రాష్ట్రాభివృద్ధి కోసం అందరూ కలిసి పనిచేయాల్సిన సమయం వచ్చిందని అభిప్రాయపడ్డారు

# వైసీపీ నేత నాగార్జున యాదవ్‌కు బెయిల్ మంజూరు



హైదరాబాద్ : సీఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసీపీ నేత నాగార్జున యాదవ్‌కు నాంపల్లి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. కాగా, వైసీపీ అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్‌ను తెలంగాణ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఓ చానల్ నిర్వహించిన లైవ్ డిబేట్‌లో పాల్గొన్న నాగార్జున.. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై మండిపడ్డారు. రేవంత్‌రెడ్డిని జొమాటో డెలివరీ బాయ్ అని సంబోధిస్తూ.. ప్రభుత్వ జీవోలు కూడా సరిగా చదవడం రాదని విమర్శించారు. ఎమ్మెల్యేగా కూడా రేవంత్‌రెడ్డి పనికిరాడంటూ వ్యాఖ్యానించారు. దీంతో ఆదివారం నాగార్జున యాదవ్‌కు ఎలాంటి నోటీస్ ఇవ్వకుండా గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో అతడిని ఇంటికెళ్లి అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే.

# టీటీడీ స్విమ్స్ ఉద్యోగాల భర్తీలో అక్రమాలు : భూమన ఆరోపణ

అమరావతి : టీటీడీ ఆధ్వర్యంలోని స్విమ్స్ ఆసుపత్రి ( ాఎ×మీ ) లో ఉద్యోగాల భర్తీ జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి ( ఖుతీబఖుఝతీ తీవఎఎ ) డిమాండ్ చేశారు. 303 ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో నిబంధనలను పాతరేసారని, పారదర్శకత కోల్పోయిందని శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో ఆరోపించారు. ముందే ఎంపిక చేసిన అభ్యర్థుల కోసమే నోటిఫికేషన్ రూపొందించారని, ప్రశ్నాపత్రాల రూపకల్పనలో పక్షపాతం జరిగిందని విమర్శించారు.

# హస్తినకు పోయి రావలె...

**విజయవాడ, జూలై 17, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి త్వరలోనే దేశ రాజధాని ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్నట్లు రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. ఈ నెల 20వ తేదీ నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో, అదే సమయంలో ఆయన ఢిల్లీ వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న రాజకీయ పరిణామాలు, లాకప్ డెత్ వ్యవహారాలూ తమ పార్టీ శ్రేణులపై జరుగుతున్న దాడుల అంశాన్ని జాతీయ స్థాయిలో చర్చకు పెట్టడమే లక్ష్యంగా ఈ పర్యటన సాగనుందని సమాచారం. ఈ పర్యటనలో భాగంగా వైఎస్ జగన్ కేంద్ర ప్రభుత్వ పెద్దలను, ముఖ్యంగా ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సహా ఇతర కీలక నాయకులను కలిసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఏపీలో ప్రస్తుతం నెలకొన్న శాంతిభద్రతల పరిస్థితిపై ఆయన కేంద్రానికి ఒక సమగ్ర నివేదికను సమర్పించనున్నట్లు వైసీపీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఎన్నికల ఫలితాల అనంతరం రాష్ట్రవ్యాప్తంగా తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై జరిగిన దాడులు, ఆస్తుల ధ్వంసం మరియు నమోదైన కేసుల వివరాలను ఆయన కేంద్ర పెద్దల దృష్టికి తీసుకెళ్లనున్నారు.కేంద్ర ప్రభుత్వ పెద్దలతో పాటు పార్లమెంట్ వేదికగా జాతీయ మీడియా మరియు ఇతర ప్రాంతీయ పార్టీల మద్దతు కూడగట్టేందుకు కూడా జగన్ వ్యూహాలు రచిస్తున్నట్లు సమాచారం. తమ పార్టీకి ఉన్న ఎంపీల ద్వారా పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ఏపీ పరిణామాలపై గళం విప్పేలా ప్రణాళిక సిద్ధం చేశారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకోబడిన నాయకులను వేధిస్తున్నారనే కోణంలో కేంద్రానికి ఫిర్యాదు చేయడం ద్వారా, కూటమి ప్రభుత్వంపై జాతీయ స్థాయిలో ఒత్తిడి తీసుకురావచ్చని జగన్ భావిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**జగన్ ధీమా వెనుక...**

వైసీపీ అధినేత వైఎస్ జగన్ నేతలను ఇంకా యాక్టివ్ చేయాల్సిన అవసరం ఉంది. ఎన్నికలు పూర్తయి రెండేళ్లవుతున్నా ఇంకా కొందరు నేతలు మాత్రమే పార్టీలో యాక్టివ్ రోల్ పోషిస్తున్నారు. అందులోనూ ఒక సామాజికవర్గానికి చెందిన నేతలే ఎక్కువగా మీడియాలో కనిపిస్తున్నారు. మిగిలిన నేతలు బయటకు రావడం లేదు. వైఎస్ జగన్ అనేక పర్యటనలు చేస్తున్నారు. జిల్లాలు తిరుగుతున్నారు. అయినా అక్కడి వరకే నేతలు పరిమితమవుతున్నారు. పూర్తి స్థాయిలో నేతలు యాక్టివ్ కాకపోవడంతో వైసీపీ క్యాడర్ కొంత అయోమయంలో ఉంది. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరగనుండటంతో నేతలు కనెక్ట్ కాకుంటే గెలుపు అసాధ్యమని చెబుతున్నారు. జగన్ పర్యటనలు విజయవంతం అవుతున్నప్పటికీ ఎన్నికల సమాయానికి క్యాడర్, లీడర్ కలసి పనిచేస్తేనే కొంత సక్సెస్ లభిస్తుంది. కానీ ఇప్పుడు దాదాపు వంద నియోజకవర్గాల్లో ఆ పరిస్థితి కనిపించడం లేదు. దీనికి ప్రధాన కారణం ఇంకా వేచి చూడాలని నాయకులు అనుకోవడమే. ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు కొంత ఊపు మీద ఉన్నప్పటికీ వారికి అవసరమైన న్యాయ సాయాన్ని అందించడంలోనూ లీడర్లు విఫలమవుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే సమయంలో జగన్ అనేక సార్లు సమావేశాలు పెట్టి నేతలకు హిత బోధ చేసినప్పటికీ నేతల్లో మార్పులు రాకపోవడం, కొందరు టీడీపీ ఎమ్మెల్యేలతో కలసి వ్యాపారాలు సాగించడం వంటి కారణాలు ఈ పరిస్థితికి కారణమని కార్యకర్తలే నేరుగా ఆరోపణలు చేస్తున్నారు.. వైసీపీ అధినేత గా జగన్ ఈసారి కూడా తన వల్లనే పార్టీ గెలుస్తుందన్న భ్రమలో ఉన్నారు. కానీ ఆ భ్రమ నుంచి ఎంత త్వరగా బయటపడితే అంత మంచిదన్న సూచనలు వెలువడుతున్నాయి. గత ఎన్నికల్లో క్యాడర్ కు లీడర్ కు మధ్య సమన్వయ లేమితోనే దారుణ ఓటమి చవి చూడాల్సి వచ్చిందని చెబుతున్నారు. కానీ తన పర్యటనలకు వస్తున్న జనాలను చూసిన జగన్ కు మాత్రం ఈసారి కూడా తన బొమ్మ అధికారం తెచ్చి పెడుతుందన్న అతి విశ్వాసంతో ఉన్నారు. కానీ అవతల కూటమి కలసి ఉంటే గెలుపు అన్నది అంత సులువు కాదన్న విషయాన్ని గుర్తుంచుకుని వీలయినంత త్వరగా నియోజకవర్గాల వారీగా సమావేశాలు పెట్టుకుంటే మంచిదని కొందరు హితవు పలుకుతున్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## మైనర్ బాలిక తో అసభ్య ప్రవర్తన స్థానికుల దాడిలో మృతి

**హైదరాబాద్ పెన్ పవర్:** కులసుంపుర పోలీస్ స్టేషన్ లో దారుణం జరిగింది. తొమ్మిదేళ్ల మైనర్ బాలిక పై అసభ్యంగా ప్రవర్తిస్తున్న వీడియోస్ సీసీ టీవిలో రికార్డు ఐయ్యాయి మైనర్ బాలికకు ముద్దు ఇస్తూ, ప్రైవేట్ పార్ట్స్ తాకుతున్న వీడియోస్ బాలిక తల్లి తండ్రులు, స్థానికులు చూసారు. ఆవేశం తో నిందుతుడిపై పేరెంట్స్ డబుల్ బెడ్ రూమ్ వాసులు దాడి చేయగా, ఉస్మానియా హాస్పటల్ లో చికిత్స పొందుతు మృతి చెందాడు. కుల్సుంపుర పోలీస్ స్టేషన్ పరిధిలో ఇందిరమ్మ డబుల్ బెడ్ ట బ్లాక్ లో ఘటన జరిగింది. నిందుతుడు హాజీజ్ అబ్దుల్ నీలోఫోర్ హాస్పిటల్ లో టీ అమ్ముతు జీవనం కొనసాగిస్తున్నాడు. మైనర్ బాలిక 4వ్త క్లాస్ చదువుతుండగా, పేరెంట్స్ ప్రైవేట్ జాబ్స్ చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. వీడియోలు చూసిన స్థానికులు అబ్దుల్ పై దాడి చేసారు. తీవ్ర గాయాలయిన అబ్దుల్ ను పోలీసులు ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అబ్దుల్ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 9 రూపాయిలకు చేరిన కోడిగుడ్డు ధర

**కాకినాడ, జూలై 17, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో కోడి గుడ్డు ధర సామాన్యుడిపై గుదిబండలా మారింది. కోళ్ల ఫారాల వద్దే ఒక్కో కోడి గుడ్డు రూ. 6.95 పైసలతో రికార్డు స్థాయికి చేరుకుంది. ఇప్పటి వరకు ఇదే అత్యధిక ధర కావడం విశేషం. ఫారాల వద్ద రూ. 6.95 పైసలు ఉన్న కోడి గుడ్డు ధర రిటైల్ మార్కెట్‌లో రూ. 8.50 పైసలకు పైగానే పలుకుతుంది. గతేడాది ఇదే రోజున రూ. 4.90 పైసలు ఉండగా ఇప్పుడు డబుల్ అయింది.నిత్యావసర ధరలు రోజురోజుకూ పెరిగిపోతూనే ఉన్నాయి. తాజాగా కోడిగుడ్డు ధర కూడా ఆకాశాన్ని తాకింది. మిడిల్ క్లాస్ ఇళ్లల్లో నాన్ వెజ్‌కి ప్రత్యామ్నాయంగా ఉన్న గుడ్డు ధర చూసి ప్రజలు షాక్ అవుతున్నారు. కోళ్ల ఫారాల దగ్గరే రికార్డు స్థాయికి ధర చేరగా.. ఇక బయట మార్కెట్లలో ఏ రకంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. సడెన్‌గా పెరిగిన ఈ కోడి గుడ్డు రేటుతో సామాన్యుడు సతమతమవుతున్నాడు.తూర్పుగోదావరి జిల్లాలో కోళ్ల ఫారాలు చాలా ఎక్కువ. రాష్ట్రంలోని అనేక ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాలు, విదేశాలకు కూడా ఇక్కడి గుడ్లే ఎగుమతి అవుతుంటాయి. అలాంటి తూర్పు గోదావరి జిల్లాలో కోళ్ల ఫారం వద్దే గుడ్డు ధర రూ. 6.95 పైసలు ఉంది. ఇప్పటి వరకు కోడి గుడ్డు ధర అత్యధికంగా ఉన్న రేటు కూడా ఇదే కావడం విశేషం.తూర్పు గోదావరి జిల్లాలో సాధారణంగా 1.3 కోట్లకు పైగా కోళ్లు ఉండగా రోజుకు కోటి వరకు గుడ్లు ఉత్పత్తి అవుతుండటం సర్వసాధారణం. ఈ ఏడాది ఎండల తీవ్రత అధికంగా ఉండటం వల్ల కోళ్లు కూడా చాలా ఎక్కువగానే మృతిచెందాయి. అధికారికంగా ఈ సంఖ్యం 16.35 లక్షలు ఉండగా, అనధికారికంగా 20 లక్షలకు పైగా కోళ్లే మృతి చెందాయని రైతులు చెబుతున్నారు. దాంతో పాటు బతికిన కోళ్లు కూడా పూర్తి స్థాయిలో గుడ్లు పెట్టకపోవడంతో గుడ్ల కొరత ఏర్పడింది.ప్రస్తుతం కోళ్ల ఫారాల వద్ద గుడ్డు ధర రూ. 6.95 పైసలు ఉండగా, అదే బహిరంగ మార్కెట్‌లో రూ. 8.50 పైసలకు పైనే విక్రయిస్తున్నారు. గతేడాది ఇదే రోజు రూ. 4.94 పైసలు ఉండగా ఇప్పుడు ఆ ధర రెట్టింపయింది. దీంతో పాటు కిలో చికెన్ ధర కూడా రూ. 300కు పైమాటే. దాణా ధరలు విపరీతంగా పెరగడంతోనే ఈ ధరలు పెరిగాయని రైతులు అంటున్నారు. సోయా ధర టన్ను రూ. 40 వేల నుంచి రూ. 65 వేలకు, నూనె తీసిన తౌడు ధర రూ. 12 వేల నుంచి రూ. 22 వేలకు మొక్కజొన్న ధర కూడా పెరిగిందని రైతులు చెబుతున్నారు.

## పవన్ ఆదర్శం... ఆచరించాల్సిన బాట

**గుంటూరు, జూలై 17: పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో విలువల మార్పు, ప్రజాధనం వినియోగంపై సరికొత్త చర్చ తెరపైకి వచ్చింది. ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రజాధనాన్ని ఆదా చేసే విషయంలో ఒక నూతన సంప్రదాయానికి నాంది పలికారు. చట్ట ప్రకారం ఒక మంత్రిగా లేదా ప్రజాప్రతినిధిగా తమ వ్యక్తిగత వైద్య ఖర్చులు, ప్రయాణాలు, ఇతర ప్రోటోకాల్ ఖర్చులకు ప్రభుత్వ నిధులను వాడుకునే హక్కు, వెసులుబాటు ఉన్నప్పటికీ.. వీరిద్దరూ తమ వ్యక్తిగత అవసరాలకు పూర్తిగా సొంత డబ్బులనే ఖర్చు పెట్టుకుంటున్నారు. రాజకీయాల్లోకి కేవలం సేవ చేయడానికే వచ్చామంటూ, కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని ప్రభుత్వ ఖజానాలోనే మిగిల్చేలా వీరు తీసుకున్న నిర్ణయం కొత్త మార్పునకు దారి తీసే అవకాశం కనిపిస్తోంది.గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఐదేళ్ల హయాంలో పాలకులు ప్రదర్శించిన తీరుతో పోల్చి చూస్తే ఈ మార్పును ప్రముఖంగా హైలెట్ అవుతోంది. గత ప్రభుత్వంలో కొందరు మంత్రులు, కీలక నేతలు చిన్నపాటి తలనొప్పి, తుమ్ములు, దగ్గులు వచ్చినా సరే.. పక్క రాష్ట్రమైన హైదరాబాద్‌లోని అత్యంత ఖరీదైన కార్పొరేట్ ఆసుపత్రుల్లో చేరిపోయేవారు. ఆ వైద్య బిల్లుల మొత్తాన్ని ఏకంగా ప్రభుత్వ శాఖల ద్వారా రీఇంబర్స్‌మెంట్ చేయించుకుని, ప్రజాధనాన్ని అడ్డగోలుగా వాడుకునేవారు. కేవలం ప్రజాప్రతినిధుల వైద్యం పేరుతోనే కోట్ల రూపాయల ఖజానా నిధులు పక్కదారి పట్టగా.. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో పవన్ కల్యాణ్, లోకేష్ వంటి అగ్రనేతలు ఆ పద్ధతికి స్వస్తి పలికి మిగతా వారికి ఆదర్శంగా నిలిచారు.చట్టపరంగా లేదా ఒకే ఒక్క జీవో ద్వారా ప్రజాప్రతినిధులందరికీ ఈ వైద్య, వ్యక్తిగత సౌకర్యాల ఖర్చులను పూర్తిగా రద్దు చేయడం ప్రభుత్వానికి సాధ్యం కాదు. ఎందుకంటే, శాసనసభలో ఉండే ఎమ్మెల్యేలందరూ ఒకే ఆర్థిక స్తోమత కలిగిన వారు కాదు. వారిలో సామాన్య మధ్యతరగతి నుంచి గెలిచిన పేద ఎమ్మెల్యేలు, దళిత, గిరిజన వర్గాల నేతలు కూడా ఉంటారు. ఏదైనా తీవ్ర అనారోగ్యం పాలైనప్పుడు వారికి ప్రభుత్వ పరంగా లభించే ఈ చట్టబద్ధమైన సదుపాయం ఎంతో అవసరం. కానీ, కోట్ల రూపాయల వ్యాపారాలు, భారీ ఆస్తులు ఉండి ఆర్థికంగా అత్యంత పటిష్టమైన స్థితిలో ఉన్న ధనిక ప్రజాప్రతినిధులు కూడా ఇదే సదుపాయాన్ని గుడ్డిగా వాడుకోవడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్న ఉదయిస్తోంది.రాజకీయ విశ్లేషకులు ఒక సరికొత్త , విప్లవాత్మకమైన ప్రతిపాదనను తెరపైకి తెస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం గతంలో ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్నవారు తమ గ్యాస్ సబ్సిడీని స్వచ్ఛందంగా వదులుకోవాలంటూ గివ్ ఇట్ అప్ ప్రచారాన్ని విజయవంతంగా నడిపినట్లుగానే.. ఏపీ అసెంబ్లీలో కూడా ఒక నూతన విధానాన్ని తీసుకురావాలని సూచిస్తున్నారు. ఆర్థికంగా శక్తి సామర్థ్యాలు ఉన్న ప్రజాప్రతినిధులు ఎవరైనా.. తాము ప్రభుత్వం నుంచి ఎలాంటి వ్యక్తిగత లేదా వైద్య రీఇంబర్స్‌మెంట్లు తీసుకోబోమని స్వచ్ఛందంగా ఒక డిక్లరేషన్ సమర్పించే పద్ధతిని ప్రవేశపెట్టాలి. ఇలాంటి డిక్లరేషన్ విధానం కనుక అమల్లోకి వస్తే, అది దేశ రాజకీయాల్లోనే ఒక చారిత్రాత్మక మార్పు అవుతుంది. పవన్ కల్యాణ్, నారా లోకేష్ వంటి వారు ఇప్పటికే ఆచరణలో చూపిస్తున్న ఈ విధానాన్ని అధికారికంగా మార్చి, ఇతర ధనిక ఎమ్మెల్యేలు కూడా డిక్లరేషన్ ఇచ్చేలా ప్రోత్సహిస్తే.. ఏటా వందల కోట్ల ప్రజాధనం ఆదా అవుతుంది. అంతేకాకుండా, ప్రజాప్రతినిధులపై ప్రజల్లో గౌరవం ,విశ్వసనీయత మరింత పెరుగుతాయి.

**20 లక్షల ఖర్చు**

ఎన్నో ఏళ్ళ నుండి ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి ని వెంటాడుతున్న భుజాల నొప్పి సమస్యకు శాశ్వత పరిష్కారం చేసుకోవడం కోసం , రీసెంట్ గానే ముంబై కి వెళ్లి అంబానీ హాస్పిటల్ లో సర్జరీ చేయించుకున్న సంగతి తెలిసిందే. ఎలాంటి కాంప్లికేషన్స్ లేకుండా, కేవలం మూడున్నర గంటల్లోనే పవన్ కళ్యాణ్ కి సర్జరీ పూర్తి చేశారు వైద్యులు. కాసేపటి క్రితమే పవన్ కళ్యాణ్ ఆ హాస్పిటల్ నుండి డిశ్చార్జ్ అయ్యారు. ముందుగా రెండు భుజాలకు ఒకేసారి సర్జరీ చేయించుకోవాలని అనుకున్నారు పవన్ కళ్యాణ్. కానీ ఒకేసారి రెండు భుజాలకు సర్జరీ చేస్తే, నొప్పి భరించలేని స్థాయిలో ఉంటుందని డాక్టర్లు చెప్పడం తో , ముందుగా కుడి భుజానికి సర్జరీ చేశారు. నాలుగు నెలలు పూర్తి అయ్యాక ఎడమ భుజానికి కూడా సర్జరీ చేయనున్నారు. అయితే ఈ సర్జరీ కి అయ్యే ఖర్చు మొత్తాన్ని పవన్ కళ్యాణ్ తన సొంత డబ్బులను వెచ్చించారు.

# టార్గెట్లతోనే జనసేన పని



**విజయవాడ, జూలై 17, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను జనసేన పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. కూటమి ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా ఉన్న పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఇప్పటి నుంచే క్షేత్రస్థాయి వ్యూహాలకు పదును పెడుతున్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో సాధించిన చారిత్రాత్మక విజయాల జోష్‌ను స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కొనసాగించాలని, జనసేన పోటీ చేసే ప్రతి స్థానంలోనూ ఖచ్చితంగా గెలిచి తీరాల్సిందేనని ఆయన పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఈ మేరకు జనసేన ముఖ్య నాయకులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లకు పవన్ కళ్యాణ్ పక్కా టార్గెట్లను నిర్దేశిస్తున్నట్లు తెలుస్తోంది.ఈ ఎన్నికల్లో ప్రధానంగా ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యూహాలకు గట్టి గండి కొట్టాలని పవన్ కళ్యాణ్ పట్టుదలగా ఉన్నారు. గతంలో అధికార బలాన్ని ఉపయోగించి వైసీపీ ఏకగ్రీవాలు చేసుకున్న దుస్థితి మళ్లీ రాకూడదని, ఎక్కడా ఒక్క స్థానం కూడా వైసీపీ ఏకగ్రీవం కాకుండా పటిష్టమైన నిఘా మరియు వ్యూహాలు అమలు చేయాలని ఆయన ఆదేశించారు. కూటమిలోని మిత్రపక్షాలైన తెలుగుదేశం, బీజేపీలతో సమన్వయం చేసుకుంటూనే, జనసేన బలంగా ఉన్న ప్రాంతాల్లో మేజర్ స్థానిక సంస్థలను కైవసం చేసుకోవడమే ఏకైక లక్ష్యంగా పనిచేయాలని స్పష్టం చేశారు.ముఖ్యంగా గత అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన పార్టీ క్లీన్ స్వీప్ చేసిన 21 నియోజకవర్గాల్లోని మేజర్ స్థానిక సంస్థలపై పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టి సారించారు. తాను అభ్యర్థులను నిలబెట్టి గెలిపించుకున్న ఆ 21 స్థానాల పరిధిలోని మున్సిపాలిటీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో మెజారిటీ స్థానాలను జనసేన ఖాతాలోనే వేయాలని ఆయన పట్టుదలతో ఉన్నారు. గ్రామీణ స్థాయి నుంచి పార్టీ క్యాడర్‌ను యాక్టివ్ చేయడం ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధించి, క్షేత్రస్థాయిలో పార్టీ మూలాలను మరింత బలోపేతం చేయాలని పవన్ కళ్యాణ్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు.

**సేనానికి సెగ**

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తన సొంత పార్టీ నేతల నుంచే కొంత అసంతృప్తిని ఎదుర్కొంటున్నారు. పవన్ కళ్యాణ్ నయకత్వాన్ని ఎవరూ కాదనడం లేదు. కానీ పొరుగున ఉన్న తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ తో పోల్చి మరోసారి చూపుతూ సోషల్ మీడియాలో వస్తున్న పోస్టింగ్ లు పవన్ ను కొంత ఇబ్బంది పెడుతున్నాయి. తమిళనాడులో మొన్నటి ఎన్నికల్లో విజయ్ గెలిచిన వెంటనే ఒంటరిగా పోటీ చేసి గెలిచాడని, మనం ఎందుకు చేయకూడదని జనసేన క్యాడర్ ప్రశ్నించినట్లు పవన్ కల్యాణ్ ఒక సమావేశంలో చెప్పారు. అయితే తమిళనాడుకు, ఆంధ్రప్రదేశ్ కు చాలా తేడా ఉందని, తనను విజయ్ పార్టీతో పోల్చవద్దని కూడా పవన్ కల్యాణ్ పదే పదే చెబుతున్నారుకాగా తమిళనాడు లో విజయ్ సినీ రంగం నుంచి నేరుగా రాజకీయ రంగంలోకి వచ్చారు. అయినా సరే ఏ మాత్రం జంకుబొంకు లేకుండా పాలన చేస్తున్నారు. పాలనలో తన మార్క్ ను విజయ్ చూపుతున్నాడు. అవినీతికి వ్యతిరేకంగా విజయ్ తీసుకుంటున్న నిర్ణయాలు దేశ వ్యాప్తంగా చర్చకు కారణమయ్యాయి. అలాగే ఆకస్మిక తనిఖీలతో విజయ్ ప్రభుత్వ అధికారుల వెన్నుల్లో వణుకు పుట్టిస్తున్నారు. మద్యం విషయంలోనూ, ఇచ్చిన హామీల అమలు విషయంలోనూ ఎక్కడా విజయ్ నిధులు లేవు అని చెప్పడం లేదు. అలాగే ప్రత్యర్థులపై విరుచుకుపడుతూనే తన లక్ష్యమేంటో ప్రజలకు వివరించే ప్రయత్నం చేస్తున్నారు. అయినా తనకు ఎక్కడా రాజకీయ అనుభవం లేదని ఆయన చెప్పుకోవడం లేదు.. కానీ పవన్ కల్యాణ్ మాత్రం తరచూ తనకు పాలన అనుభవం తక్కువని, అందుకే తాను పొత్తు పెట్టుకోవాల్సి వస్తుందని చెప్పడాన్ని జనసైనికులే తప్పుపడుతున్నారు. ఒక ముఖ్యమంత్రికి పాలనా అనుభవం అవసరం లేదని, సామాజిక స్పృహ ఉంటే సరిపోతుందని, పాలనపరమైన వ్యవహారాలను ఉన్నతాధికారులు చూసుకుంటారని, అనుభవజ్ఞులైన మంత్రులను పెట్టుకుంటే పాలన చేయడం పెద్ద కష్టమేమీ కాదని, అలాగనుకుంటే ఎవరూ క్రమేపీ ముఖ్యమంత్రి కాలేదని, తొలిసారి నేరుగా ముఖ్యమంత్రి అయి ఎన్నో జనరంజక కార్యక్రమాలన చేపట్టిన విషయాలను ఈ సందర్భంగా కొందరు సోషల్ మీడియాలో గుర్తు చేస్తున్నారు. కానీ అనుభం లేదన్న సాకుతో పదిహేనేళ్లు పొత్తు పెట్టుకుంటామని చెబుతుండటాన్ని అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కానీ పవన్ షణ్ముఖ వ్యూహం ఏంటో తెలియదని, అది తెలిసిన తర్వాత తమ గళం విప్పుతామని కొందరు అంటున్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల సవాల్

**విజయవాడ, జూలై 17 పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబా బు స్థానిక సంస్థల ఎన్నికలను సవాల్ గా తీసుకున్నారు. ముం దుగా మున్సిపల్ ఎన్నికలను నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు సమాచారం. పట్టణ ఓటర్లు కొంత భవిష్యత్ ను దృష్టిలో పెట్టుకుని ఓట్లు వేస్తారని చంద్రబాబు నమ్మకం కావచ్చు. పంచాయతీ, మండల పరిషత్ ఎన్నికలు తర్వాత జరపాలని చంద్రబాబు ప్రాథమికంగా నిర్ణయించినట్లు తెలిసింది. పట్టణ ప్రాంత ఓటర్లయితే రాష్ట్రంలో జరిగే అభివృద్ధితో పాటు తన పాలనకు, గత పాలనకు బేరీజు వేసుకుని ఓటు వేస్తారని ఆయన నమ్మకంగా ఉన్నట్లుంది. అందుకే తొలుత మున్సిపల్ ఎన్నికలకు వెళ్లాలని చంద్రబాబు నిర్ణయించారు. అయితే మున్సిపల్ ఎన్నికలలోనూ కూటమితో కలసి పోటీ చేస్తుండటంతో దీనిని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న చంద్రబాబు నిన్న సాయంత్రం జనసేన, బీజేపీ నేతలతో సమావేశమయ్యారు. క్షేత్రస్థాయిలో మూడు పార్టీల కార్యకర్తల మధ్య ఇబ్బందులు, అపోహలు లేకుండా చూసుకునేందుకు జిల్లాలు, నియోజకకవర్గాల వారీగా సమావేశాలు పెట్టుకుంటే బాగుంటుందని సూచించారు. ఏ పార్టీకి ఆ పార్టీ సమావేశాలు పెట్టుకుని తమకు బలం ఉన్న ప్రాంతంలో పోటీ చేసే విధంగా క్యాడర్ ను సమాయత్తం చేయాలని చెప్పినట్లు తెలిసింది. దీంతో పాటు ఇక రాష్ట్ర స్థాయిలో కూడా కూటమి సమన్వయ కమిటీ సమావేశాలు తరచూ జరిగేలా ఒక క్యాలెండర్ ను ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించారు. . దీనివల్ల మిత్ర పక్షాల మధ్య ఎలాంటి బేధాభిప్రాయాలు లేకుండా ఎన్నికలకు వెళ్లవచ్చని చంద్రబాబు అభిప్రాయపడుతున్నారు. ా×= ప్రక్రియ పూర్తయిన వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలన్న యోచనలో చంద్రబాబు ఉన్నారు. ఇదే విషయాన్ని కూటమి సమావేశంలో చెప్పినట్లు తెలిసింది. ప్రభుత్వం గత రెండేళ్లుగా చేసిన మంచి పనులను ప్రజలకు వివరించేలా మూడు పార్టీలు కలసి అన్ని ప్రాంతాల్లో సమావేశాలను ఏర్పాటు చేసుకుని ప్రజలను చైతన్య వంతుల్ని చేయాలని నిర్ణయించారు. ఇక సీట్ల సర్దుబాటు విషయంలో స్థానిక ఎమ్మెల్యేలతో పాటు అక్కడి నేతల అభిప్రాయాలను కూడా తీసుకుని తర్వాత చేసుకుంటే కొంత సత్ఫలితాలనిస్తుందన్న అంచనాలో చంద్రబాబు ఉన్నారు. మున్సిపాలిటీలను క్లీన్ స్వీప్ చేస్తే ఇక తమకు మిగిలిన ఎన్నికల్లో తిరుగుండదని భావిస్తున్నారు.

**అధికారులపై గుస్సా**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇటీవల కాలంలో అధికారుల పనితీరు, పాలనపై పలు కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో వ్యవస్థలను గాడిలో పెట్టాలని, అధికారుల పనితీరు మారాలని ఆయన స్పష్టం చేశారు.పరిపాలనలో గతంలో జరిగిన తప్పులను పునరావృతం చేయవద్దని, విధులు సక్రమంగా నిర్వర్తించాలని హెచ్చరించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులను ఉపేక్షించేది లేదంటూ సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. సోషల్ మీడియాలో ప్రభుత్వ ప్రతిష్టకు భంగం కలిగించేలా, తప్పుడు ప్రచారాలు, వ్యక్తిత్వ హననానికి పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించారు. కులాలు, మతాల పేరుతో చిచ్చుపెట్టే ప్రయత్నాలను తిప్పికొట్టాలని, పబ్లిక్ గ్రీవెన్స్ సమస్యలను మానవీయ కోణంలో పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అయినా కొందరు అధికారులు కొంత ప్రభుత్వానికి నెగిటివ్ గా పనిచేస్తున్నారని చంద్రబాబుకు అవగతమయింది. కొందరు కీలక స్థానంలో ఉన్న అధికారులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేస్తున్నారని, ఇటువంటి వారిని గుర్తించి జాగ్రత్తగా లేకపోతే భారీ నష్టం తప్పదని మంత్రులను హెచ్చరించారు. ఇటువంటి వారిని గుర్తించి అవసరమైతే వారిని ఆ యా స్థానాల నుంచి తప్పించాలని కూడా మంత్రులకు ఆదేశించారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన రెండేళ్ల తర్వాత ఈ విషయం అర్థమయినట్లుంది. గత కొంతకాలంగా ప్రత్యర్థి పార్టీలకు ప్రభుత్వ సమాచారం అందుతుండటంతో పాటు అన్ని రకాల డాక్యుమెంట్లు కూడా వెళుతుండటాన్ని చంద్రబాబు గమనించారు. వాటిని పట్టుకుని వైసీపీ నేతలు తమను విమర్శిస్తున్నారని, అయితే ఇటువంటి వారిపై జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించడం ఇప్పుడు అధికార వర్గాల్లో చర్చగా మారింది. చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా అధికారులను తన నియంత్రణలో ఉంచుకుంటారు.

# వరల్డ్ కప్ ఫైనల్‌కు రెఫరీగా విన్సిచ్.. అర్జెంటీనాకు పాత భయాలు.. మెస్సీ అభిమానుల్లో టెన్షన్!

**2026 ప్రపంచకప్ ఫైనల్‌కు రెఫరీగా స్లోవేనియాకు చెందిన స్లావ్కో విన్సిచ్**

**2022లో విన్సిచ్ రెఫరీయింగ్‌లోనే సౌదీ చేతిలో అర్జెంటీనా ఓటమి**

**తాజా నియామకంతో అర్జెంటీనా అభిమానుల్లో నెలకొన్న ఆందోళన**

**స్పెయిన్ ఆడిన కీలక మ్యాచ్‌లలో విన్సిచ్ రెఫరీగా వ్యవహరించి సానుకూల ఫలితాలు**

**ఫైనల్‌లో విన్సిచ్ ప్రతి నిర్ణయంపై తీవ్ర ఒత్తిడి ఉండే అవకాశం**





**హైదరాబాద్ పెన్ పవర్:** 2026 ఫిఫా ప్రపంచకప్ ఫైనల్ సమరానికి రంగం సిద్ధమైంది. న్యూయార్క్ వేదికగా ఆదివారం అర్జెంటీనా, స్పెయిన్ జట్ల మధ్య జరిగే ఈ టైటిల్ పోరుకు స్లోవేనియాకు చెందిన ప్రముఖ రెఫరీ స్లావ్కో విన్సిచ్‌ను ఫిఫా నియమించింది. ఈ వార్త ఫుట్‌బాల్ ప్రపంచంలో సంతోషం నింపినప్పటికీ, అర్జెంటీనా అభిమానుల్లో మాత్రం తీవ్ర ఆందోళన రేకెత్తిస్తోంది. దీనికి కారణం విన్సిచ్ రెఫరీయింగ్‌లో అర్జెంటీనాకు ఉన్న ఒక చేదు గతం. ఈ ప్రతిష్ఠాత్మక మ్యాచ్‌కు తనను ఎంపిక చేసినట్లు తెలియగానే, రెఫరీ కిట్ అందుకుంటూ విన్సిచ్ భావోద్వేగానికి గురై కన్నీళ్లు పెట్టుకున్నాడు. ఈ మ్యాచ్‌లో అతనికి సహాయకులుగా తోమాజ్ క్లాంక్నిక్, ఆంద్రాజ్ కోవాసిచ్ (ఇద్దరూ స్లోవేనియాకు చెందినవారే) వ్యవహరించనున్నారు.

**అర్జెంటీనాకు ఎందుకు ఆందోళన?**

స్లావ్కో విన్సిచ్ పేరు వినగానే అర్జెంటీనా అభిమానులకు 2022 ఖతార్ ప్రపంచకప్‌లో జరిగిన ఒక ఘోర పరాభవం గుర్తుకొస్తుంది. ఆ టోర్నమెంట్‌లో అర్జెంటీనా ఆడిన తొలి మ్యాచ్ సౌదీ అరేబియాతో జరిగింది. నవంబర్ 22న లుసైల్ స్టేడియంలో జరిగిన ఆ మ్యాచ్‌కు విన్సిచ్ రెఫరీగా ఉన్నాడు. ఆట ప్రారంభమైన 8వ నిమిషంలోనే అర్జెంటీనాకు పెనాల్టీ ఇవ్వగా, మెస్సీ గోల్ చేశాడు. ఆ తర్వాత మ్యాచ్ మొత్తం మీద సౌదీ ఆటగాళ్లకు ఆరు ఎల్లో కార్డులు కూడా చూపించాడు. కానీ, చివరికి ఫలితం తారుమారైంది. సెకండాఫ్‌లో సౌదీ అరేబియా సంచలన ప్రదర్శన చేసి 2-1 తేడాతో అర్జెంటీనాను ఓడించి ప్రపంచాన్ని నివ్వెరపరిచింది. ప్రపంచకప్ చరిత్రలోనే అది ఒక పెద్ద షాక్. మెస్సీ జట్టు విన్సిచ్ రెఫరీయింగ్ లో ఓడిపోయిన ఏకైక మ్యాచ్ కూడా ఇదే కావడం గమనార్హం. ఈ పాత జ్ఞాపకాలే ఇప్పుడు అర్జెంటీనా అభిమానులను కలవరపెడుతున్నాయి.

**స్పెయిన్‌కు మాత్రం సానుకూల చరిత్ర**

అర్జెంటీనాకు విన్సిచ్‌తో చేదు అనుభవం ఉంటే, స్పెయిన్‌కు మాత్రం అతనితో సానుకూల రికార్డు ఉంది. యూరోపియన్ టోర్నీలలో స్పెయిన్ ఆడిన అనేక కీలక మ్యాచ్‌లకు విన్సిచ్ రెఫరీగా వ్యవహరించాడు. 2017లో కొలంబియాతో స్నేహపూర్వక మ్యాచ్, యూరో 2020లో స్వీడన్‌తో గ్రూప్ మ్యాచ్, 2023లో ఇటలీతో నేషన్స్ లీగ్ సెమీ-ఫైనల్ మ్యాచ్‌లకు అతడు బాధ్యతలు నిర్వర్తించాడు. ముఖ్యంగా యువ సంచలనం లామిన్ యమాల్ జట్టులోకి వచ్చాక, యూరో 2024లో ఇటలీ, ఫ్రాన్స్‌లపై స్పెయిన్ గెలిచిన కీలక మ్యాచ్‌లకు విన్సిచ్ రెఫరీగా ఉన్నాడు. ఈ రికార్డు స్పెయిన్ జట్టుకు కొంత ఊరటనిచ్చే అంశం.

**ఈ వరల్డ్‌కప్‌లోనూ వివాదం**

ప్రస్తుత ప్రపంచకప్‌లో కూడా విన్సిచ్ తన కఠిన నిర్ణయాలతో వార్తల్లో నిలిచాడు. మెక్సికో-ఈక్వెడార్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఈక్వెడార్ ఆటగాడు పీరో హిన్కాపీకి రెడ్ కార్డ్ చూపించాడు. ప్రత్యర్థి ఆటగాడితో మాట్లాడేటప్పుడు నోటికి చేయి అడ్డుపెట్టుకోవడం ఫిఫా నియమావళిని ఉల్లంఘించడమేనని భావించి ఈ నిర్ణయం తీసుకున్నాడు. దీన్ని బట్టి చూస్తే, అతడు నిబంధనల విషయంలో ఎంత కఠినంగా ఉంటాడో అర్థమవుతుంది. అర్జెంటీనా మ్యాచ్‌లలో రెఫరీ నిర్ణయాలు తరచూ వివాదాస్పదం అవుతున్న నేపథ్యంలో, ఈ ఫైనల్‌లో స్లావ్కో విన్సిచ్ ప్రతి నిర్ణయంపై ప్రపంచం దృష్టి నిలుస్తుంది. అతనిపై తీవ్ర ఒత్తిడి ఉండటం ఖాయం.

# భారత్‌కు రోహిత్-కోహ్లీ.. ఇంగ్లాండ్‌కు జో రూట్: కుంబ్లే

- రూట్‌ను విరాట్, రోహిత్‌తో పోల్చిన కుంబ్లే
- ఈ ముగ్గురూ ఒత్తిడిలో ఇన్నింగ్స్ నిర్మిస్తారని ప్రశంస
- రూట్ వన్డే శైలిపై ప్రత్యేక వ్యాఖ్యలు
- ముగ్గురూ బంతిని చూసి స్పందిస్తారని వివరణ
- తక్కువ రిస్క్‌తో ఎక్కువ పరుగులు ఇచ్చే షాట్లని ఎంచుకుంటారని ప్రశంస



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియాకు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఎంత కీలక ఆటగాళ్లో ఇంగ్లండ్‌కు జో రూట్ అంతే కీలకమని మాజీ స్పిన్నర్ అనిల్ కుంబ్లే అన్నాడు. ఒత్తిడిలో ఇన్నింగ్స్‌ను నిలబెట్టే సామర్థ్యం ఈ ముగ్గురిలోనూ ఒకేలా ఉంటుందని చెప్పాడు. కార్డిఫ్‌లో జరిగిన రెండో వన్డేలో రూట్ ఆడిన 99 పరుగుల ఇన్నింగ్స్‌పై స్పందిస్తూ కుంబ్లే ఈ వ్యాఖ్యలు చేశాడు.

234 పరుగుల లక్ష్య ఛేదనలో రూట్ 133 బంతుల్లో 99 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఇన్నింగ్స్‌ను చివరి వరకు నడిపించి ఇంగ్లండ్‌కు నాలుగు వికెట్ల విజయాన్ని అందించాడు. అయితే గస్ అట్కిన్సన్ బౌండరీ కొట్టడంతో రూట్ ఒక్క పరుగు తేడాతో సెంచరీ మిస్ చేసుకున్నాడు.

రూట్ ఇప్పటికీ సంప్రదాయ వన్డే శైలిలోనే బ్యాటింగ్ చేస్తాడని కుంబ్లే పేర్కొన్నాడు. మిగతా ఇంగ్లండ్ బ్యాటర్లు ఆరంభం నుంచే దూకుడుగా ఆడగా, రూట్ మాత్రం ఓపికగా ఇన్నింగ్స్‌ను నిర్మించాడని చెప్పాడు. స్ట్రైక్‌ను మారుస్తూ, గ్యాప్‌లలోకి బంతిని పంపిస్తూ ఒత్తిడిని తగ్గించడంలో అతను సిద్ధహస్తుడని కొనియాడాడు. అవసరం లేని సమయంలో రిస్క్ షాట్లు ఆడకపోవడమే అతని బలం అని వివరించాడు.ఇంగ్లండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్‌తో పోలిస్తే రూట్ ప్రత్యేకత స్పష్టంగా కనిపించిందని కుంబ్లే అభిప్రాయపడ్డాడు. పరిస్థితులు సహకరించని పిచ్‌పై కూడా బ్రూక్ టీ20 తరహా షాట్లు ఆడేందుకు ప్రయత్నించాడని, రూట్ మాత్రం వన్డే బ్యాటింగ్‌కు ఆదర్శంగా నిలిచే ఇన్నింగ్స్ ఆడాడని పేర్కొన్నాడు.రూట్, విరాట్, రోహిత్ విజయాల వెనుక ఉన్న అసలు రహస్యం కూడా ఇదేనని కుంబ్లే చెప్పాడు. ఈ ముగ్గురు ముందే షాట్ నిర్ణయించుకోరని, బంతిని చూసి స్పందిస్తారని వివరించాడు. తక్కువ రిస్క్‌తో ఎక్కువ పరుగులు ఇచ్చే షాట్లనే ఎంచుకుంటారని తెలిపాడు. అలాంటి ఆటతీరు జట్టుకు కూడా ఎంతో ఉపయోగపడుతుందని కుంబ్లే అభిప్రాయపడ్డాడు.

# డోపింగ్ వివాదంలో పాక్ క్రికెటర్ మొహమ్మద్ నవాజ్‌కు భారీ ఊరట.. కానీ ఆ రికార్డులు రద్దు!

**హైదరాబాద్ పెన్ పవర్:** పాకిస్థాన్ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ మొహమ్మద్ నవాజ్‌కు డోపింగ్ వివాదంలో భారీ ఊరట లభించింది. ఐసీసీ యాంటీ-డోపింగ్ నిబంధనలను ఉల్లంఘించినందుకు అతనిపై విధించిన మూడు నెలల నిషేధం ముగిసింది. ప్రత్యేక చికిత్సా కార్యక్రమాన్ని పూర్తి చేయడం ద్వారా అతని శిక్షను ఒక నెలకు తగ్గించడంతో నవాజ్ మళ్లీ మైదానంలోకి అడుగుపెట్టేందుకు మార్గం సుగమమైంది.

**ఏమిటీ వివాదం?**

ఈ ఏడాది ఫిబ్రవరి 7న శ్రీలంకలోని కొలంబోలో నెదర్లాండ్స్‌తో జరిగిన టీ20 ప్రపంచ కప్ 2026 ప్రారంభ మ్యాచ్ అనంతరం నవాజ్‌కు యాంటీ-డోపింగ్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో అతను 'కార్బాక్సీ-టీహెచ్‌సీ' (ఝుతీఎశీఇ-ఎ-ుఎఙ) అనే నిషేధిత ఉత్ప్రేరకాన్ని వాడినట్టు పాజిటివ్‌గా తేలింది. కార్బాక్సీ-టీహెచ్‌సీ అనేది గంజాయిలో ఉండే ప్రాథమిక సైకోయాక్టివ్ రసాయనమైన టీహెచ్‌సీ ఉత్పత్తి. మానవ శరీరం గంజాయిని ప్రాసెస్ చేసినప్పుడు, కాలేయం ఈ సమ్మేళనాన్ని నిర్దిష్ట పదార్థంగా మారుస్తుంది. ఇది శరీరంలో ఎక్కువ కాలం నిల్వ ఉండటం వల్ల, సాధారణ మూత్ర పరీక్షల్లో దీనిని ప్రధాన లక్ష్యంగా చేసుకుని డ్రగ్స్‌ను గుర్తిస్తారు.

**శిక్ష తగ్గడానికి కారణం**

తాను నిబంధనలను ఉల్లంఘించినట్లు 32 ఏళ్ల నవాజ్ అంగీకరించాడు. అయితే, ఈ పదార్థాన్ని తాను పోటీలకు వెలుపల ఉపయోగించానని, క్రీడా ప్రదర్శనను మెరుగుపరుచుకోవడానికి దీనికి ఎలాంటి సంబంధం లేదని ఐసీసీ ముందు నిరూపించుకోగలిగాడు. దీంతో ఐసీసీ మొదట మూడు నెలల అనర్హత వేటు వేసినప్పటికీ, అతని వివరణతో సంతృప్తి చెందింది. మే 1 నుంచి అతను స్వచ్ఛందంగా తాత్కాలిక సస్పెన్షన్ ప్రారంభించిన తేదీ నుంచి ఈ శిక్షను వర్తింపజేసింది. అంతేకాకుండా ఆమోదిత మాదకద్రవ్యాల దుర్వినియోగ చికిత్సా కార్యక్రమాన్ని పూర్తి చేస్తే, శిక్షను ఒక నెలకు తగ్గిస్తున్నట్టు ఐసీసీ వెసులుబాటు కల్పించింది.

నేడు ఐసీసీ విడుదల చేసిన ఒక ప్రకటనలో.. "నవాజ్ తనపై విధించిన శిక్షను అంగీకరించి, చికిత్సా కార్యక్రమానికి కట్టుబడి ఉన్నందున, సుమారు రెండున్నర నెలల సస్పెన్షన్ పూర్తి చేసుకున్న తర్వాత అతని తాత్కాలిక నిషేధాన్ని ఎత్తివేయడం జరిగింది. ఐసీసీ సంతృప్తి మేరకు చికిత్సా కార్యక్రమాన్ని పూర్తి చేస్తే, నవాజ్ ఇకపై ఎలాంటి అనర్హత కాలాన్ని ఎదుర్కోవాల్సిన అవసరం లేదు" అని స్పష్టం చేసింది.

# ఓటీటీ మార్కెట్ స్లో అయినా.. చైతూకి ఎందుకింత డిమాండ్?

టాలీవుడ్ లో గత కొంతకాలంగా ఓటీటీ మార్కెట్ జోరు తగ్గిందనే చర్చ సాగుతోంది. ఒకప్పుడు స్టార్ హీరోల సినిమాలకు భారీ మొత్తాలు వెచ్చించిన డిజిటల్ సంస్థలు ఇప్పుడు మాత్రం ఎంపిక చేసిన ప్రాజెక్టులకే పెద్ద మొత్తాలు కేటాయిస్తున్నాయి. అలాంటి పరిస్థితుల్లో అక్కినేని నాగ చైతన్య నటిస్తున్న వృషకర్మ సినిమాకు సంబంధించిన నాన్ థియేట్రికల్ బిజినెస్ వార్తలు హాట్ టాపిక్‌గా మారాయి.

సినిమా విడుదలకు ఇంకా సమయం ఉండగానే భారీ డిజిటల్, శాటిలైట్ డీల్ జరిగిందనే ప్రచారం వినిపిస్తోంది. దీంతో ప్రస్తుతం ఓటీటీ మార్కెట్ స్లోగా ఉన్నా చైతూకి ఎందుకింత డిమాండ్ ఏర్పడిందనే చర్చ మొదలైంది. ఇటీవల నాగ చైతన్య కెరీర్ లో కీలక మలుపుగా నిలిచిన చిత్రం తండేల్. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకోవడమే కాకుండా చైతన్య మార్కెట్ ను కూడా పెంచిందని చెప్పాలి.



సున్నితమైన న్యూట్రల్ రంగుల దుస్తుల్లో క్లాసిక్ హుందాతనాన్ని చాటుతున్న కత్రినా కైఫ్



చాలా కాలంగా ఒక పెద్ద కమర్షియల్ హిట్ కోసం ఎదురుచూసిన చైతూ, తండేల్ తో ఆ లోటును కవర్ చేశారు. ఆ సక్సెస్ ఎఫెక్ట్ ఇప్పుడు ఆయన కొత్త సినిమా వృషకర్మపై కనిపిస్తోందని టాక్ వినిపిస్తోంది. మరోవైపు వృషకర్మ సాధారణ కమర్షియల్ సినిమా కాదు. మిస్టరీ, అడ్వెంచర్, పురాణ అంశాలు, నిధుల అన్వేషణ వంటి అంశాలతో తెరకెక్కుతున్న ఈ చిత్రం నాగ చైతన్యను కొత్త కోణంలో చూపించబోతోంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ లో ట్రెజర్ హంటర్ పాత్రలో చైతూ లుక్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. గతంలో చేయని రోల్ లో కనిపించబోతుం డటంతో సినిమాపై ఆసక్తి మరింత పెరిగింది. దర్శకుడు కార్తీక్ దండు పేరు కూడా ఆ ప్రాజెక్టుకు ప్రత్యేక ఆకర్షణగా మారింది. విరూపాక్ష వంటి విజయం తర్వాత ఆయన రూపొందిస్తున్న సినిమా కావడంతో ప్రేక్షకులతో పాటు డిజిటల్ సంస్థల్లోనూ నమ్మకం పెరిగినట్లు తెలుస్తోంది.

ఓటీటీ సంస్థలు ఇప్పుడు కేవలం స్టార్ ఇమేజ్ ను మాత్రమే చూడడం లేదు. థియేటర్ల తర్వాత కూడా ఎక్కువకాలం వీక్షకులను ఆకర్షించే కంటెంట్ కే ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఆ కోణంలో చూస్తే వృషకర్మలో ఉన్న మిస్టరీ, ఫాంటసీ, థ్రిల్లర్ అంశాలు డిజిటల్ ప్రేక్షకులను ఆకట్టుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని భావిస్తున్నారు. దీంతో చైతన్య సినిమా కోసం ముందుగానే భారీ పెట్టుబడి పెట్టడానికి ఓటీటీ సంస్థలు ఆసక్తి చూపినట్లు సమాచారం.

అలాగే నాగ చైతన్యకు తెలుగు రాష్ట్రాలతో పాటు ఓటీటీ ద్వారా ఇతర భాషల ప్రేక్షకుల్లోనూ మంచి గుర్తింపు ఉంది. ఇటీవల కాలంలో ఆయన సినిమాలు డిజిటల్ ప్లాట్ ఫామ్స్ లో కూడా మంచి ఆదరణ పొందినట్లు తెలుస్తోంది. ఆ అంశం కూడా వృషకర్మ డీల్ కు కలిసి వచ్చినట్లు చెబుతున్నారు. అలా ప్రస్తుతం ఓటీటీ మార్కెట్ నెమ్మదించినా, ట్రాక్ రికార్డ్, పెరుగుతున్న మార్కెట్, కొత్త తరహా కథలు ఎంపిక చేసుకోవడం, దర్శకుడిపై ఉన్న నమ్మకం వంటి అంశాలు నాగ చైతన్యకు డిమాండ్ తీసుకొచ్చినట్లు కనిపిస్తోంది. అందుకే వృషకర్మ విడుదలకు ముందే ఇండస్ట్రీలో ఇంతటి చర్చకు కారణమవుతోందని ట్రేడ్ పండితులు అభిప్రాయపడుతున్నారు.



స్రవంతి చోకరపు ఒక అందమైన జీవిత సందేశాన్ని పంచుకున్నారు

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at 38/291-6, Sreerama nagar colony, Near Central prison, KADAPA CITY, KADAPA DISTRICT, ANDHRAPRADESH-516002, Editor : GANTYADA APPARAO Mobile : 9059465965, RNI : APTEL/25/A2231, editorpenpower@gmail.com